ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు


సంపుటి : 1 సంచిక : 39 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 16 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 39 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 16 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం

- నేడు ఏపీలో ప్రధాని మోదీ పర్యటన
- శ్రీశైలం, కర్నూలులో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ప్రధాని
- పర్యటనను విజయవంతం చేయాలని నేతలకు సీఎం చంద్రబాబు పిలుపు
- గూగుల్ రాక వెనుక ప్రధాని, కేంద్ర మంత్రుల చొరవ ఉందన్న ముఖ్యమంత్రి
- రూ.13 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్న మోదీ



**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ గురువారం చేపట్టనున్న శ్రీశైలం, కర్నూలు పర్యటనలను అత్యంత విజయవంతం చేయాలని సీఎం చంద్రబాబు కూటమి నేతలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన మంత్రులు, నంద్యాల, కర్నూలు జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ విధానాలతో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతోందని, దానికి నిదర్శనమే ఇటీవలి గూగుల్ ఒప్పందమని ఆయన అన్నారు.ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వనీ వైష్ణవ్ ప్రత్యేక చొరవతోనే గూగుల్ సంస్థ రాష్ట్రానికి ఏఐ డేటా హబ్

వివరాలు 2లో..

# అన్ని రంగాల్లో ఏపీ నెంబర్ వన్‌గా ఉండాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- గూగుల్‌తో పాటు అదీ ముఖ్యమే: మంగళగిరిలో నారా లోకేశ్
- టాటా హిటాచీ డీలర్‌షిప్ షోరూం, మెషిన్ కేర్ ఫెసిలిటీని ప్రారంభించిన మంత్రి
- అన్ని రంగాల్లో ఏపీ నెంబర్ వన్‌గా ఉండాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్య
- మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేస్తున్నామన్న మంత్రి
- గూగుల్ తో పాటు డీలర్ షిప్‌లు కూడా ముఖ్యమేనన్న లోకేశ్






**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా ఉండాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, దేశంలోనే మంగళగిరిని అభివృద్ధి పథాన నిలుపుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళగిరి బైపాస్ ఆత్మకూరులో లక్ష్మీ గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీ ధనలక్ష్మి ఆటో ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ నూతనంగా ఏర్పాటుచేసిన టాటా హిటాచీ డీలర్ షిప్ షోరూం, మెషిన్ కేర్ ఫెసిలిటీని రిబ్బన్ కట్ చేసి మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. "ఇక్కడకు వస్తుంటే రోడ్డుపైన ఒక ఎక్స్‌కవేటర్ పెట్టారు. అది చూసినప్పుడు నాకు 2019-24 మధ్య రోజులు గుర్తుకు వచ్చాయి. గత ప్రభుత్వంలో శుక్ర, శనివారాలు వస్తే ఈ బుల్డోజర్‌ను ఎవరో ఒకరి ఇంటికి పంపేవారు. ఎవరో ఒకరిని ఇబ్బంది పెట్టాలని గత ప్రభుత్వం ప్రయత్నించింది. ప్రజా ప్రభుత్వంలో మాత్రం ఎక్స్‌కవేటర్స్‌ను అభివృద్ధి కోసం, అమరావతి పనులు, రోడ్ల అభివృద్ధి చేసేందుకు ఉపయోగిస్తోంది. మంగళగిరి అమరావతికి ముఖద్వారం. అమరావతిలో పనులు చేసేవారు మంగళగిరిలోనే ఉండాలి. సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎకోసిస్టమ్ మంగళగిరిలోనే ఇప్పుడు సిద్ధంగా ఉంది. 2019 ఎన్నికల్లో 21 రోజుల ముందు మంగళగిరికి వచ్చాను. మీ సమస్యలను నేను అర్థం చేసుకోలేకపోయాను. నేనేంటో మీకు తెలియదు. 5300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఐదేళ్లపాటు మీకు అందుబాటులో ఉండి మీ సమస్యలు తెలుసుకున్నాను. ప్రభుత్వం కంటే మెరుగైన సేవా కార్యక్రమాలను ఆనాడు నేను చేశాను" అని లోకేశ్ అన్నారు.

**మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు**

2024 ఎన్నికల్లో మంగళగిరిలో పోటీ చేయవద్దని తనను చాలామంది కోరారని, అయినా ఇక్కడి నుంచే పోటీచేసి గెలుస్తానని చెప్పానని లోకేశ్ గుర్తు చేసుకున్నారు. 53 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఆనాడు కోరానని,

వివరాలు 2లో..




## తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

- ఆస్ బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో కీలకోపన్యాసం చేయనున్న మంత్రి
- దేశంలో ఈ గౌరవం దక్కిన ఏకైక మంత్రి శ్రీధర్ బాబు
- ఆహ్వానించిన ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ

వివరాలు 2లో..

## మాకు భారత్ సాయం కావాలి..

### అమెరికా ఆర్థిక మంత్రి



వివరాలు 2లో..

- అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు
- ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్ష సవాలేనన్న స్కాట్ బెసెంట్
- అమెరికా ప్రపంచ శాంతిని కోరుకుంటుంటే.. చైనా మాత్రం ఆర్థిక యుద్ధం చేస్తోందని ఫైర్

## లై డిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధం.. నా ఫోన్ మీరే చెక్ చేసుకోండి:

### సీఎంకు జోగి రమేశ్ సవాల్



- నకిలీ మద్యం కేసు నిందితుడితో వాట్సాప్ చాట్‌పై జోగి రమేశ్ స్పందన
- ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్
- తన ఫోన్‌ను సీఎం, లోకేశ్‌కే ఇస్తానన్న మాజీ మంత్రి

వివరాలు 2లో..

## డేటా సెంటర్ అంటే ఏమిటో లోకేశ్ కు తెలుసా?

- నకిలీ మద్యం కేసులో సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- డేటా సెంటర్‌పై మాజీ మంత్రి అమర్‌నాథ్‌తో చర్చకు లోకేశ్ సిద్ధమా అని సవాల్
- వైసీపీ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చేశామన్న భరత్



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో కలకలం రేపుతున్న నకిలీ మద్యం వ్యవహారంపై వైసీపీ మాజీ ఎంపీ మార్గాని భరత్ తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ కేసు పై ప్రత్యేక దర్యాప్తు బృందం

వివరాలు 2లో..

## పండగ ఆఫర్లతో సైబర్ వల..

### ఆన్‌లైన్ షాపింగ్‌లో జాగ్రత్త అంటూ పోలీసుల హెచ్చరిక!



- పండగ సీజన్‌లో పెరిగిన సైబర్ మోసాలపై హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక
- నకిలీ వెబ్‌సైట్లు, ఏపీకే ఫైల్స్‌తో ఆన్‌లైన్ షాపర్లే లక్ష్యంగా మోసాలు
- గిఫ్ట్ ఆఫర్ నమ్మి రూ.1.40 లక్షలు నష్టపోయిన సికింద్రాబాద్ మహిళ
- ఫేక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి వృద్ధుడు రూ.1.02 లక్షలు పోగొట్టుకున్న వైనం
- గుర్తుతెలియని లింకులు, యాప్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచన
- మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని వెల్లడి

వివరాలు 2లో..

# రన్నింగ్ ట్రైన్ లో మహిళపై అత్యాచారం.. గుంటూరులో దారుణం

- బోగీలో ఒంటరిగా ఉన్న తనను కత్తితో బెదిరించి రేప్ చేశాడని వెల్లడి
- గుంటూరు, పెద్దకూరపాడు స్టేషన్ల మధ్య ఘటన
- చర్లపల్లి చేరుకున్నాక రైల్వే పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు




**పెన్ పవర్ డెస్క్:** రైలు ప్రయాణంలో ఒంటరిగా ఉన్న మహిళపై ఓ దుండగుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బోగీలో బాధితురాలు తప్ప ఎవరూ లేకపోవడాన్ని అవకాశంగా తీసుకున్న దుండగుడు.. కత్తితో బెదిరించి అత్యాచారం చేయడంతో పాటు బాధితురాలి డబ్బు, నగలు ఎత్తుకెళ్లాడు. ఏపీలోని రాజమహేంద్రవరం

వివరాలు 2లో..

## నకిలీ మద్యంపై ఏపీ ప్రభుత్వం ఉక్కుపాదం

- 'ఎక్సైజ్ సురక్ష' పేరుతో సరికొత్త యాప్ ప్రారంభం
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా యాప్ ఆవిష్కరణ
- మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్ స్కాన్‌తో గుర్తింపు
- కొన్నది అసలు మద్యమో, నకిలీదో వెంటనే తెలిసిపోతుంది



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నకిలీ మద్యం అమ్మకాలకు అడ్డుకట్ట వేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. కల్తీ మద్యాన్ని గుర్తించి, దాని బెడద నుంచి ప్రజలను కాపాడేందుకు 'ఎక్సైజ్ సురక్ష' పేరుతో ఒక సరికొత్త మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా వినియోగదారులే స్వయంగా తాము కొనుగోలు చేసిన మద్యం అసలైనదో

వివరాలు 2లో..

## వైసీపీ కోడి గుడ్డు తెస్తే.. టీడీపీ గూగుల్‌ను తీసుకొచ్చింది



- గూగుల్ ఏపీకి వస్తే వైసీపీ ఏడవటం బాధాకరమన్న ఎమ్మెల్యే
- గూగుల్ టేక్ అవుట్ ద్వారా సమాచారం సేకరిస్తారనే భయం ఉందేమోనని ఎద్దేవా
- గూగుల్ ఏపీకి గేమ్ ఛేంజర్ అన్న యార్లగడ్డ వెంకట్రావు

వివరాలు 2లో..



## 2040లో భారతీయ వ్యోమగామి చంద్రుడిపై అడుగు పెడతారు

- అంతరిక్ష రంగ అభివృద్ధికి అనేక ప్రాజెక్టులు చేపట్టినట్లు వెల్లడి
- 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపిస్తామన్న ఇస్రో చీఫ్
- దేశంలో ఇప్పుడు 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పని చేస్తున్నాయన్న ఇస్రో చీఫ్

**పెన్ పవర్ డెస్క్:**వికసిత భారత్‌కు సూచికగా 2040లో భారతీయ వ్యోమగామి చంద్రుడిపై అడుగు పెట్టనున్నారని ఇస్రో ఛీఫ్ నారాయణన్ పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధికి ప్రస్తుతం అనేక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# అన్ని రంగాల్లో ఏపీ నెంబర్ వన్‌గా ఉండాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- మొదటి పేజీ తరువాయి

తనను ఏకంగా 91 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించారని అన్నారు. ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సహచర మంత్రులు.. ఇలా ఎవరైనా మంగళగిరి కోసం పని అంటే కాదని చెప్పేవారు లేరని అన్నారు.ఇంటి పట్టాలు, వంద పడకల ఆసుపత్రి, స్మశానాల అభివృద్ధి, కమ్యూనిటీ భవనాలు, భూగర్భ డ్రైనేజీ, తాగునీరు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. మంగళగిరిలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. బుల్డోజర్‌ను మంచి కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని అన్నారు. జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్‌ను మంగళగిరిలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంత పని ఒత్తిడి ఉన్నా ముందు మంగళగిరికే ప్రాధాన్యత ఇస్తానని, గూగుల్ ఎంత ముఖ్యమో ఈ డీలర్ షిప్ కూడా తనకు అంతే ముఖ్యమని అన్నారు.

### గూగుల్‌తో పాటు డీలర్‌షిప్?లు కూడా ముఖ్యమే

"డీలర్‌షిప్ వల్ల ఎంతోమందికి ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ప్రతి ఉద్యోగం ఎంతో ముఖ్యం. గూగుల్ లాంటి సంస్థ వస్తే సరిపోదు. వారు భవన నిర్మాణాలు చేయాలంటే ఎకో సిస్టమ్ కావాలి. ఇదే ఎక్స్‌కవేటర్, బుల్డోజర్ కూడా అవసరం. దానికి సర్వీస్ సెంటర్ కావాలి. చంద్రబాబుని చూసే నేను ఇది నేర్చుకున్నాను. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. డీలర్‌షిప్‌ల వల్ల కూడా ఉద్యోగాల కల్పన జరుగుతుంది. మొత్తం ఎకోసిస్టమ్ వస్తే మేం ఇవన్నీ సాధించగలగుతాం. ఇతర డీలర్‌షిప్‌లను కూడా మంగళగిరి ఏర్పాటు చేస్తే మా యువతకు ఉద్యోగాలు వస్తాయని కంభంపాటి గారిని కోరుతున్నాను. లక్ష్మీ గ్రూప్‌ను చూస్తూ పెరిగాను. ఎంతో నిబద్ధత గల సంస్థ. టీడీపీ ఎంతోమంది ఎదుగుదలకు తోడ్పడింది. కంభంపాటి గారు దాదాపు 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించారు. సంస్థ మరింత వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్నాను" అని లోకేశ్ అన్నారు.

### దేశంలోనే మంగళగిరిని నెం.1గా అభివృద్ధి చేస్తాం

మంగళగిరి ప్రజలకు అందుబాటులో ఉంటానని, దేశంలోనే మంగళగిరి నియోజకవర్గాన్ని నెంబర్ వన్‌గా అభివృద్ధి చేస్తామని లోకేశ్ అన్నారు. వచ్చే నెలలో భూగర్భ డ్రైనేజీ పనులు కూడా ప్రారంభిస్తామని అన్నారు. టాటా హిటాచీ ఎండీ సందీప్ సింగ్ మద్దతు ఏపీకి ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. కంపెనీలు ఏపీకి రావడం వెనుక అనేక మంది కృషి ఉందని, అన్ని రంగాల్లో ఏపీ నెం.1 ఉండాలనేదే మా లక్ష్యమని లోకేశ్ చెప్పారు.

అనంతరం ఎక్స్‌కవేటర్లను కొనుగోలు చేసిన పలువురు కస్టమర్లకు మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గ్రూప్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ కంభంపాటి రామ్మోహన్ రావు, టాటా హిటాచీ ఎండీ సందీప్ సింగ్, లక్ష్మీ గ్రూప్ ఎండీ కె. జయరాం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. భరత్ భూషణ్, ఆపరేషనల్ డైరెక్టర్ కె. వెంకట శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం

- మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని చంద్రబాబు తెలిపారు. ఢిల్లీలో కుదిరిన ఈ చారిత్రాత్మక ఒప్పందం వెనుక ఐటీ మంత్రి నారా లోకేశ్ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టు, దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అని ఆయన గుర్తుచేశారు.గత ప్రభుత్వ విధ్వంసకర విధానాల వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, వాటిని సరిదిద్దడానికే చాలా సమయం పట్టిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. రాయలసీమను పారిశ్రామిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు.రేపటి పర్యటనలో ప్రధాని మోదీ రూ.13 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని సీఎం వివరించారు. కర్నూలులో జరిగే 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున హాజరవుతారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కూటమిలోని మూడు పార్టీల నేతలు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

# 2040లో భారతీయ వ్యోమగామి చంద్రుడిపై అడుగు పెడతారు

- మొదటి పేజీ తరువాయి

వాటిలో 80 వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్ల తయారీ, 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపడం, 2035 నాటికి జాతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రుడిపై అధ్యయనానికి వీనస్ ఆర్బిటర్ మిషన్ ఏర్పాటు వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు.2027లో చేపట్టబోయే మానవసహిత గగనయాత్ర మిషన్ ప్రణాళికాబద్ధంగా సాగుతోందని వెల్లడించారు. 2040 నాటికి తొలి మానవసహిత చంద్రయాత్ర చేపట్టాలని ప్రధాన మంత్రి నిర్దేశించారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఈ అంతరిక్ష యాత్ర కీలకమని ఆయన అన్నారు.కొన్నేళ్ల క్రితం అంతరిక్ష రంగంలో రెండు లేదా మూడు స్టార్టప్‌లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం ఉపగ్రహ తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా విశ్లేషణపై అధ్యయనం కోసం 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఇస్రో చీఫ్ వెల్లడించారు. వ్యవసాయం మొదలు వాహన పర్యవేక్షణ వరకు ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల అధ్యయనానికి ఈ ప్రయోగాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు.

# రన్నింగ్ ట్రైన్ లో మహిళపై అత్యాచారం.. గుంటూరులో దారుణం

- మొదటి పేజీ తరువాయి

సంత్రగచి స్పెషల్ ట్రైన్ లో ఈ దారుణం చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. చర్లపల్లి వెళ్లేందుకు బాధిత మహిళ రాజమహేంద్రవరంలో సంత్రగచి స్పెషల్ ఎక్కింది.రైలు గుంటూరు దాటిన తర్వాత ఆ బోగీలో తను తప్ప ఎవరూ లేరని, ఇంతలోనే 40 సంవత్సరాల వయస్సున్న దుండగుడు బోగీలోకి వచ్చాడని తెలిపింది. తాను ఒంటరిగా ఉండడాన్ని అవకాశంగా తీసుకున్న నిందితుడు.. కత్తితో బెదిరించి తనపై అఘాయిత్యం చేశాడని తెలిపింది. రైలు గుంటూరు, పెద్దకూరపాడు మధ్య ప్రయాణిస్తుండగా ఈ దారుణానికి పాల్పడ్డాడని చెప్పింది. అనంతరం, తన హ్యాండ్ బ్యాగ్, సెల్ ఫోన్ లాక్కుని పెద్దకూరపాడు స్టేషన్ లో రైలు ఆగగానే దిగిపోయాడని తెలిపింది. చర్లపల్లికి చేరుకున్నాక బాధితురాలు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి.. దర్యాప్తు ప్రారంభించారు.

# వైసీపీ కోడి గుడ్డు తెస్తే.. టీడీపీ గూగుల్‌ను తీసుకొచ్చింది

వైసీపీ తన ఐదేళ్ల పాలనలో కోడిగుడ్డును తీసుకువస్తే, టీడీపీ గూగుల్‌ను తీసుకొచ్చిందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, "గత మూడు రోజులుగా వైసీపీ నాయకులు ప్రెస్‌మీట్‌లు పెట్టి ఏమాత్రం స్పష్టంగా మాట్లాడటం లేదు. వారి మాటలను ఒకసారి శాంతంగా చూసి, రివ్యూ చేయాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. అక్టోబర్ 14, 2025 ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చారిత్రాత్మక రోజు" అని అన్నారు.గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్ హబ్‌ని విశాఖలో స్థాపించేందుకు కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని ఆయన తెలిపారు. మన రాష్ట్ర బడ్జెట్ సుమారు రూ. 3,22,000 కోట్లు ఉంటే, సగటున ప్రతి సంవత్సరం రాష్ట్రానికి వచ్చే ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుంటే ఐదేళ్లలో ఇది రూ. 32,000 కోట్లు వంటి పెద్ద అంకెలకు చేరుతుందని అన్నారు. ఇలాంటి పెట్టుబడిని దేశంలో మొట్టమొదటిసారిగా గొప్ప స్థాయిలో ఆకర్షించడం విషయంలో కొందరు విమర్శలు ఎలా చేయగలుగుతున్నారని ప్రశ్నించారు.

దేశంలో 29 రాష్ట్రాలు ఉంటే, ఇలాంటి గూగుల్ డేటా హబ్ ఆంధ్రకు వెళ్లిందేంటని చాలా రాష్ట్రాలు బాధపడుతున్నాయని ఆయన అన్నారు. కానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చిందని వైసీపీ విమర్శించడం బాధాకరమని అన్నారు. "మనకి ఏదైనా తెలియకపోతే గూగుల్ చేస్తాం. డేటా ఇస్తే తీసుకుంటాం. అటువంటి గూగుల్ మన రాష్ట్రానికి వస్తే ఊరు, పేరు లేని కంపెనీ వచ్చినట్లుగా ఎందుకు మాట్లాడుతున్నారు? 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి దేశంలో మొట్టమొదటిసారిగా వచ్చింది" అని అన్నారు.

లోకేశ్ 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే ప్రయత్నం చేస్తుంటే, దానిని ఎలా అడ్డుకోవాలనే దుష్ట ప్రయత్నాలే వైసీపీలో కనిపిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఉన్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తే మీకు మనుగడ ఉండదనే అనుమానంతో మీరు ఇలా మాట్లాడటం సరికాదని అన్నారు. ఈ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో 15 మిలియన్ డాలర్లు పెట్టుబడి వచ్చినప్పుడు మీరు నోరు మూసుకుని, 'వెల్‌కమ్ టూ ఏపీ గూగుల్' అని బోర్డు చూపిస్తే ప్రజలు సంతోషించేవారిని వెంకట్రావు అన్నారు. దానికి బదులుగా కాకి గోల చేస్తున్నారని విమర్శించారు.

### గూగుల్‌పై ఆ కోపం ఉందా?

అభివృద్ధి చెందటం మీకు ఇష్టం లేదా, లేక కడప మాజీ ఎంపీ కేసులో గూగుల్ టెక్ అవుట్ ద్వారా సమాచారం సేకరిస్తారనే భయంతో గూగుల్‌పై మీకేమైనా కోపం ఉందా? అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని ప్రజలందరూ రాష్ట్రానికి గూగుల్ సంస్థ వస్తుందంటే గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఉందని, కానీ వైసీపీ చేసే విమర్శలను చూస్తుంటే మీకు టెక్నాలజీ అర్థం కావట్లేదని భావిస్తున్నామని అన్నారు. మీకు టెక్నాలజీ తెలిస్తే మంగళవారం గూగుల్ క్లౌడ్‌లో ఏపీ ప్రభుత్వం కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడాన్ని స్వాగతించేవారని అన్నారు. అలాగే డిజిటల్ ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కొత్త శకం నిన్నటి నుంచే ప్రారంభమైందని అన్నారు.గూగుల్ రోజువారి ఆదాయం 1.07 బ్రిలియన్ డాలర్లు అని, అలాంటి సంస్థ ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తే దేశవ్యాప్తంగా 'గూగుల్ ఏపీ' ట్రెండింగ్ అయిందని, కానీ వైసీపీ వారికి మాత్రం ఇది అర్థం కావట్లేదని విమర్శించారు. ఇది ఏదో విండ్ పవర్ ప్రాజెక్టులాగా అనుకుంటున్నారేమోనని ఎద్దేవా చేశారు. ఎక్కడో భూమి విలువ తక్కువ ఉన్న దగ్గరకు వెళ్లి విండ్ పవర్ పెట్టినట్లుగా డేటా సెంటర్ పెడుతున్నట్లు వారు భావిస్తున్నారేమోనని చురక అంటించారు. అతి తక్కువ వయస్సు గల రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు వస్తున్నాయని ఆయన అన్నారు.

హైదరాబాద్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ ఉందని, అక్కడ పెట్టిన పెట్టుబడి కేవలం 4.4 బిలియన్లు మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. కానీ 48,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఏడబ్ల్యూఎస్ మహారాష్ట్రను తీసుకుంటే 8.3 బిలియన్ల పెట్టుబడి పెడితే 81,300 ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. అలాంటిది తన ప్రాజెక్టుకు 15 బిలియన్ డాలర్లు గూగుల్ కంపెనీ పెడుతుందంటే 1.5 నుంచి 1.9 లక్షల ఉద్యోగాలు వస్తాయని అర్థం చేసుకోవాలని అన్నారు. ఒక డేటా సెంటర్ వల్ల 3 నుంచి 6 రేట్లు పరోక్షంగా ఉద్యోగాలు కల్పించే పరిస్థితి ఐటీలో పని చేసే ఎవరికైనా తెలుస్తుందని అన్నారు.

### గూగుల్ హబ్ గేమ్ ఛేంజర్

విశాఖలో గూగుల్ హబ్ రావాటం వల్ల అభివృద్ధి జరుగుతుందని, ఏపీకి గూగుల్ గేమ్ చేంజర్‌గా మారబోతుందని అన్నారు. 1998లో చంద్రబాబు మైక్రోసాఫ్ట్ తెచ్చినప్పుడు కేవలం 20 నుండి 25 మంది ఉద్యోగులు ఉండేవారని, ఇప్పుడు దేశవ్యాప్తంగా 25 వేల ఉద్యోగాలు ఉంటే, హైదరాబాద్ మైక్రోసాఫ్ట్‌లోనే 10 వేల ఉద్యోగాలు ఉన్నాయని అన్నారు. మైక్రోసాఫ్ట్ వచ్చాక హైదరాబాద్‌కు పలు దిగ్గజ కంపెనీలు వరుస కట్టాయని గుర్తు చేశారు. ఇప్పుడు దాదాపు 1500 దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా తెలంగాణ ముందుకు సాగుతుందంటే అందుకు హైదరాబాద్ కారణమని వ్యాఖ్యానించారు. నాడు చంద్రబాబు నాటిన మొక్క ఈరోజు మహావృక్షమై నడిపిస్తోందని అన్నారు.అదేవిధంగా నేడు ఏపీకి గూగుల్ వచ్చిన తరువాత ఏఐ హబ్ కూడా వచ్చే అవకాశం ఉందని అన్నారు. మాజీ ఐటీ శాఖ మంత్రి కోడిగుడ్లు గురించి చెప్పే పరిస్థితిలో ఉన్నారంటే గత ఐదేళ్ల కాలంలో వైసీపీ రాష్ట్రంలో చేసిందేమిటో అర్థం అవుతోందని వ్యాఖ్యానించారు. వైసీపీ గూగుల్ కంపెనీ రాకను వ్యతిరేకిస్తోందా, స్వాగతిస్తుందా, ఒక్క ముక్కలో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ పాలనలో చాలామందికి మంత్రి పదవులు కేటాయించి చాలా నష్టపోయారని అన్నారు. ఇంకా తెలుసుకోకపోతే వైసీపీ కనుమరుగు కావడం ఖాయమని జోస్యం చెప్పారు.

మంత్రి నారా లోకేశ్ 20 లక్షల ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక అదే లక్ష్యంతో పని చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఏపీకి మరిన్ని కంపెనీలు రానున్నాయని, రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని అన్నారు. భారతదేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూసే పరిస్థితికి వచ్చిందని అన్నారు. గతంలో బొబ్బట్లు, పచ్చళ్లు, అప్పడాలు పరిశ్రమలు తీసుకువచ్చిన వారికి ఐటీ కంపెనీల విలువ ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. జగన్ అసెంబ్లీకి రాని పరిస్థితి ఉంది కాబట్టి కనీసం మీడియా సమావేశం పెట్టి గూగుల్ రాకను స్వాగతించాలని సూచించారు.

# మాకు భారత్ సాయం కావాలి..

ప్రపంచంలోనే అరుదైన ఖనిజాల విషయంలో చైనా పోకడను అమెరికా తప్పుబట్టింది. చైనాలో దొరికే ఈ అరుదైన ఖనిజాలపై అక్కడి ప్రభుత్వం కట్టడిచేస్తోందని, తద్వారా ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఈ ధోరణిని అమెరికా సహించబోదని ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ స్పష్టం చేశారు. ఈ విషయంలో చైనాను ఎదుర్కోవాలంటే తమకు భారత్ సాహాయం కావాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతుల వ్యవహారంలో భారత్ పై అమెరికా భారీగా పన్నులు విధించిన విషయం తెలిసిందే. అయితే, చైనా విషయంలో మాత్రం భారత్ తమకు సాహాయం చేయాలని అమెరికా కోరడం గమనార్హం. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఇటీవల ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ప్రపంచంలో మరెక్కడా లభించని అరుదైన ఖనిజాల ఎగుమతిపై చైనా ఇటీవల నియంత్రణ విధించిందని చెప్పారు. విదేశీ కంపెనీలు వాటిని దిగుమతి చేసుకోవాలంటే చైనా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనే షరతు విధించిందన్నారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్ష సవాలేనని బీజింగ్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. ఇది చైనాకు, ప్రపంచ దేశాలకు మధ్య నెలకొన్న పోటీ అని ప్రపంచ పంపిణీ వ్యవస్థలపై చైనా గురిపెట్టిందని ఆయన మండిపడ్డారు. బీజింగ్ దూకుడును అమెరికా అడ్డుకుంటుందన్నారు. ఇందుకోసం భారత్, ఐరోపా దేశాల మద్దతు కావాలని వెల్లడించారు. అమెరికా ప్రపంచ శాంతిని కోరుకుంటుంటే.. చైనా ఆర్థిక యుద్ధం చేస్తోందని స్కాట్ బెసెంట్ దుయ్యబట్టారు.

# తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం లభించింది. ఆయన 'ఆస్ బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో కీలకోపన్యాసం చేయనున్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో ఇది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సదస్సుగా పరిగణించబడుతుంది.ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ ఈ మేరకు ఆయనను ఆహ్వానించారు. దేశంలో ఈ గౌరవం పొందిన ఏకైక మంత్రి శ్రీధర్ బాబు కావడం విశేషం. ఈ సదస్సు ఈ నెల 21 నుండి 24 వరకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరగనుంది. గత రెండేళ్లలో లైఫ్ సైన్సెస్ రంగంలో సాధించిన పురోగతిపై మంత్రి శ్రీధర్ బాబు ప్రసంగిస్తారు. అదే సమయంలో తెలంగాణలో ఈ రంగంలో ఉన్న అనుకూలతలు, అవకాశాలను గురించి ఆయన ప్రస్తావిస్తారు.

# లై డిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధం.. నా ఫోన్ మీరే చెక్ చేసుకోండి:

నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు జనార్ధన్ రావుతో తనకు సంబంధాలున్నాయంటూ వస్తున్న ఆరోపణలపై మాజీ మంత్రి జోగి రమేశ్ తీవ్రంగా స్పందించారు. ఆ ఆరోపణలను నిరూపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ఆయన సవాల్ విసిరారు. నిందితుడితో తాను వాట్సాప్‌లో చాటింగ్ చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని తేల్చిచెప్పారు.రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడైన జనార్ధన్ రావు విచారణలో భాగంగా, జోగి రమేశ్‌తో వాట్సాప్‌లో చాట్ చేసినట్లు చెప్పాడని వార్తలు రావడం రాజకీయంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో బుధవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన జోగి రమేశ్, ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తన ఫోన్‌ను నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్‌లకే ఇస్తానని, వారే స్వయంగా తనిఖీ చేసుకోవచ్చని అన్నారు.అంతటితో ఆగకుండా, తాను లై డిటెక్టర్ పరీక్షలకు కూడా సిద్ధమేనని ప్రకటించారు. తిరుమల వెంకన్న, బెజవాడ దుర్గమ్మపై ప్రమాణం చేసేందుకు కూడా వెనుకాడబోనని స్పష్టం చేశారు. చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు తనతో పాటు ప్రమాణానికి వస్తారా? అని ఆయన నిలదీశారు. తనపై ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని పరోక్షంగా వ్యాఖ్యానించారు. "పైన దేవుడు ఉన్నాడు..

# డేటా సెంటర్ అంటే ఏమిటో లోకేశ కు తెలుసా?

- మొదటి పేజీ తరువాయి

(సిట్) విచారణపై తమకు నమ్మకం లేదని, వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు జనార్ధన్ పోలీసు కస్టడీ తర్వాత మాట మార్చాడని భరత్ ఆరోపించారు. ఈ నెల 6వ తేదీన విడుదల చేసిన వీడియోలో ఎవరి పేరూ చెప్పని నిందితుడు, కస్టడీ అనంతరం జోగి రమేశ్ పేరు చెప్పడం వెనుక కుట్ర ఉందని అన్నారు. మూడు నెలలుగా ఈ దందా కొనసాగుతోందని ఐపీఎస్ అధికారులే చెబుతున్నారని, అమలాపురం, పాలకొల్లు, ఏలూరు, అనకాపల్లి ప్రాంతాల్లో నకిలీ మద్యం బయటపడిందని ఆయన గుర్తుచేశారు.

అదే సమయంలో, మంత్రి నారా లోకేశ్ తీరుపై కూడా భరత్ విమర్శలు గుప్పించారు. "డేటా సెంటర్ అంటే ఏమిటో లోకేశ్ కు తెలుసా?" అని ప్రశ్నించిన ఆయన, ఈ అంశంపై మాజీ ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో బహిరంగ చర్చకు లోకేశ్ సిద్ధమా అని సవాల్ విసిరారు. అప్పటి మంత్రి అమర్‌నాథ్‌ను ఉద్దేశించి లోకేశ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు.చంద్రబాబు, లోకేశ్ హైదరాబాద్‌ను తామే అభివృద్ధి చేశామని డబ్బా కొట్టుకుంటున్నారని, వాస్తవానికి అభివృద్ధి అంతా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే జరిగిందని భరత్ అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో జగన్ 9 హార్బర్లకు శ్రీకారం చుట్టారని, అభివృద్ధి వికేంద్రీకరణ, పోర్టుల అభివృద్ధి వంటివన్నీ ఆయన ఆలోచనలేనని స్పష్టం చేశారు. జిందాల్ లాంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమివేయడం వల్లే ఆ సంస్థ మహారాష్ట్రలో రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.తమ ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి చేశామని, అయితే దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేసుకోవడంలో విఫలమయ్యామని, ఇది వాస్తవమని ఈ సందర్భంగా మార్గాని భరత్ అన్నారు.

# నకిలీ మద్యంపై ఏపీ ప్రభుత్వం ఉక్కుపాదం

- మొదటి పేజీ తరువాయి

కాదో సులభంగా తెలుసుకునే వీలు కలుగుతుంది. ఇకపై రాష్ట్రంలో విక్రయించే ప్రతి మద్యం బాటిల్‌పై క్యూఆర్ కోడ్ ముద్రించడం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిబంధన విధించింది. మద్యం కొనుగోలు చేసినవారు తమ స్మార్ట్‌ఫోన్‌లోని 'ఎక్సైజ్ సురక్ష' యాప్‌తో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. స్కాన్ చేసిన వెంటనే ఆ మద్యం బాటిల్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. దీని ద్వారా అది ప్రభుత్వ అనుమతి పొందిన అసలైన మద్యమా లేక నకిలీదా అనేది స్పష్టంగా తెలిసిపోతుంది. ఈ టెక్నాలజీతో కల్తీ మద్యం దందాను సమూలంగా నిరోధించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.విక్రయించే మద్యం నాణ్యమైనదని ధ్రువీకరించనట్లు ప్రతి దుకాణం, బార్ల వద్ద ప్రత్యేక సూచీలు ఏర్పాటు చేయాలి. మద్యం సీసాపై సీల్, క్యాప్, హెూలోగ్రామ్, ప్రామాణికతను తనిఖీ చేయాలి. ప్రతి దుకాణం, బార్‌లో రోజువారీ మద్యం విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్‌ను నమోదు చేయాలి. ఎక్సైజ్ సిబ్బంది మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలి. తనిఖీ వివరాలను అక్కడ ఉన్న రిజిస్టర్‌లో నమోదు చేయాలి.డిపో నుండి మద్యం అందిన తర్వాత కనీసం 5 శాతం సీసాలను స్కాన్ చేయాలి. నకిలీ మద్యాన్ని గుర్తిస్తే వెంటనే ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేయాలి. నకిలీ మద్యం గుర్తిస్తే లైసెన్స్ రద్దు చేసి, తదుపరి విచారణ చర్యలు చేపట్టాలి. నకిలీ మద్యంపై ఫిర్యాదు చేసేందుకు పర్యవేక్షణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు రావాలి. ఫిర్యాదులను కూడా ఇరవై నాలుగు

గంటల్లోనే విచారించి నివేదించాలి.కాగా, 'ఎక్సైజ్ సురక్ష' యాప్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని బార్లు, వైన్ షాపుల వద్ద 'ఎక్సైజ్ సురక్ష' యాప్‌ను ఎలా ఉపయోగించాలో వివరించే సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఈ చర్యల ద్వారా వినియోగదారుల భద్రతకు భరోసా కల్పించడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న నకిలీ మద్యం మాఫియాకు చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# పండగ ఆఫర్లతో సైబర్ వల..

పండగ సీజన్ సమీపిస్తుండటంతో ఆన్‌లైన్ షాపింగ్ చేసే వారు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. దీపావళి సందర్భంగా సైబర్ నేరగాళ్లు భారీ డిస్కౌంట్లు, బహుమతుల పేరుతో వినియోగదారులను ఆకర్షించి, ఆర్థికంగా మోసగిస్తున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ ఈ–కామర్స్ సైట్లు, ప్రమాదకరమైన ఏపీకే (%ూాఖ%) ఫైల్స్, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సూచించారు.

### మోసగాళ్లు అనుసరిస్తున్న విధానం

సైబర్ నేరగాళ్లు పండగ వాతావరణాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, బహుమతులపై నమ్మశక్యం కాని ఆఫర్లతో కూడిన లింకులను సర్క్యులేట్ చేస్తున్నారు. ఈ లింక్‌లపై క్లిక్ చేయడం లేదా వారు పంపిన ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా బాధితుల ఫోన్లలోకి మాల్‌వేర్ ప్రవేశిస్తుంది. దీని సాయంతో వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు, క్రెడిట్/డెబిట్ కార్డు నంబర్లు, ఓటీపీలను దొంగిలించి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. కొందరు "దీపావళి గిఫ్ట్" వచ్చిందని నమ్మించి, ప్రాసెసింగ్ ఫీజు పేరుతో చిన్న మొత్తంలో డబ్బులు కట్టించుకుని, ఆ తర్వాత పెద్ద మొత్తంలో దోచేస్తున్నారు.

### నగరంలో వెలుగుచూసిన మోసాలు

కేస్ స్టడీ 1: సికింద్రాబాద్‌కు చెందిన 29 ఏళ్ల మహిళకు ఓ ప్రముఖ షాపింగ్ సైట్ ప్రతినిధులుగా నమ్మించి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఆమె గతంలో చేసిన కొనుగోలు వివరాలు చెప్పి, ప్రత్యేక గిఫ్ట్ ఆఫర్‌కు ఎంపికయ్యారని తెలిపారు. రూ.5,000 విలువైన వస్తువు కొనుగోలు చేసి, ఆ మొత్తాన్ని నేరుగా ఓ బ్యాంక్ ఖాతాకు పంపాలని సూచించారు. ఆ తర్వాత గిఫ్ట్‌గా రానున్న ఐఫోన్ 13 కోసం జీఎస్టీ కింద రూ.9,840 చెల్లించాలని కోరారు. వారి మాటలు నమ్మిన ఆమె, పలు దఫాలుగా మొత్తం రూ.1,40,000 బదిలీ చేసి మోసపోయారు.

కేస్ స్టడీ 2: అజంపురాకు చెందిన 69 ఏళ్ల వృద్ధుడు ఓ ఆన్‌లైన్ యాప్ కస్టమర్ కేర్ కోసం గూగుల్‌లో వెతకగా, నకిలీ నంబర్ లభించింది. దానికి కాల్ చేయగా, అవతలి వ్యక్తి వాట్సాప్‌లో ఒక ఏపీకే ఫైల్ పంపి ఇన్‌స్టాల్ చేసుకోమని చెప్పాడు. అలా చేసిన వెంటనే, మోసగాళ్లు అతని కుటుంబ సభ్యుల ఫోన్లపై రిమోట్ యాక్సెస్ సంపాదించి, వారి బ్యాంకు ఖాతాల నుంచి రూ.1,02,194 విత్‌డ్రా చేశారు.

### ప్రజలకు పోలీసుల సూచనలు

గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లను క్లిక్ చేయవద్దు, అనధికారిక ఏపీకే ఫైల్స్‌ను ఇన్‌స్టాల్ చేయవద్దు.కేవలం విశ్వసనీయ, గుర్తింపు పొందిన ఈ–కామర్స్ వెబ్‌సైట్ల నుంచే కొనుగోళ్లు చేయాలి.అపరిచిత లింకులు, పోర్టళ్లలో మీ బ్యాంకింగ్, కార్డు వివరాలను ఎట్టిపరిస్థితుల్లోనూ నమోదు చేయవద్దు.బహుమతులు, రివార్డులు, లక్కీ డ్రాల పేరుతో వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దు.అన్ని ఆన్‌లైన్ బ్యాంకింగ్, షాపింగ్ ఖాతాలకు టూ–ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2FA) ఎనేబుల్ చేసుకోండి.

ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. తక్షణమే స్పందిస్తే మోసపూరిత లావాదేవీలను నిలిపివేసి, నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సూచించారు.

# సమాజ హితం కోసం పాటుపడే విలేకరులకు అండగా ఉంటాం

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 15**

సమాజంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తూ అను నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తుతూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అలుపెరుగని పోరాటం చేస్తూన్న పాత్రికేయ మిత్రులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రముఖ సామాజికవేత్త, సీనియర్ జర్నలిస్ట్ బడుగు భరత్,సంచార జాతుల నాయకులు చల్లా రామయ్య లు అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల విధినిర్వహణలో యాక్సిడెంట్ అయినా పాత్రికేయ మిత్రుడు రాభీ సందీప్ ను పరామర్శించి, తమవంతు సాయంగా 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.



పెన్ పవర్
గుంటూరు। బాపట్ల। పల్నాడు

# కారంచేడు మండల రోడ్లకు"సాంబన్న" కొత్త రూపు

## ఎమ్మెల్యే కృషి ఫలితం సిసి రోడ్లు డ్రైన్ల అభివృద్ధి

## రూ.9.78 కోట్లతో సీసీ రోడ్లు అభివృద్ధికి నిధులు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 15**

కారంచేడు మండలం రహదారుల అభివృద్ధి పై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో కొత్త రూపు సంతరించుకున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సిసి రోడ్లు డ్రైన్ల అభివృద్ధికి మండల పరిధిలో మొత్తం రూ.9.78కోట్ల వ్యయంతో 79 పనులకు నిధులు మంజూరు అయ్యాయి. తొలి విడతలో రూ.4.53 కోట్లతో 33 పనులు చేపట్టగా అవిపూర్తయ్యాయి. రెండో విడతలో రూ.5.25కోట్ల వ్యయంతో 46 పనులకు నిధులు మంజూరయ్యాయి.ఈ పనులు త్వరలో ప్రారంభించాల్సి ఉంది. గ్రామాల వారిగా అభివృద్ధి పనుల వివరాలు ఇలా.... ఆదిపూడి గ్రామంలో మొత్తం రూ.52.50 లక్షల వ్యయంతో 3 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.20 లక్షల వ్యయంతో 1వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.32.50 లక్షల వ్యయంతో 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. దగ్గుబాడు గ్రామంలో మొత్తం రూ.82.50 లక్షల వ్యయంతో 7 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.25 లక్షల వ్యయంతో 1వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.57.50 లక్షల వ్యయంతో 6 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. జరుబులవారిపాలెం గ్రామంలో మొత్తం రూ.35 లక్షల వ్యయంతో 4 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.15 లక్షల వ్యయంతో 3 వర్క్ లు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.20 లక్షల వ్యయంతో 1 వర్క్ కి నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. కేశవరప్పాడు గ్రామంలో మొత్తం రూ.35 లక్షల వ్యయంతో 3 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.15 లక్షల వ్యయంతో 1వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.20 లక్షల వ్యయంతో 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. కొడవలివారిపాలెం గ్రామంలో మొత్తం రూ.55 లక్షల వ్యయంతో 5 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.25 లక్షల వ్యయంతో 3 వర్క్ లు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.30 లక్షల వ్యయంతో 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. కుంకులమర్రు గ్రామంలో మొత్తం రూ.77.50 లక్షల వ్యయంతో 9 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.35 లక్షల వ్యయంతో 3 వర్క్ లు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.42.50 లక్షల వ్యయంతో 6 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. నాయుడువారిపాలెం గ్రామంలో మొత్తం రూ.55 లక్షల వ్యయంతో 5 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఇందులో మొదటి విడతలో రూ.20 లక్షల వ్యయంతో 1వర్క్ పూర్తి అయ్యింది. రెండో విడతలో రూ.35 లక్షల వ్యయంతో 4 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. పోతినవారిపాలెం గ్రామంలో మొత్తం రూ.50 లక్షల వ్యయంతో 4 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. .ఇందులో మొదటి విడతలో రూ.30 లక్షల వ్యయంతో 2 వర్క్ లు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.20 లక్షల వ్యయంతో 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. రంగప్పనాయుడువారిపాలెం గ్రామంలో మొత్తం రూ.20 లక్షల వ్యయంతో 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఈ 2 వర్క్ లు పూర్తి అయ్యాయి.రెండవ విడతలో నందిగుంటపాలెంకు మొత్తం రూ.20 లక్షల వ్యయంతో 1 వర్క్ కు నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. స్వర్ణ గ్రామంలో మొత్తం రూ.1.10 కోట్ల వ్యయంతో 8 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.45 లక్షల వ్యయంతో 3 వర్క్ లు పూర్తి అయ్యాయి.రెండో విడతలో రూ.65 లక్షల వ్యయంతో 5 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. స్వర్ణపాలెం గ్రామంలో మొత్తం రూ.45 లక్షల వ్యయంతో 6 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఇందులో మొదటి విడతలో రూ.25 లక్షల వ్యయంతో 4 వర్క్ లు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.20 లక్షల వ్యయంతో 2 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. తిమిడితిపాడు గ్రామంలో మొత్తం రూ.80.50 లక్షల వ్యయంతో 5 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.మొదటి విడతలో రూ.38 లక్షల వ్యయంతో 2 వర్క్ లు మంజూరయ్యాయి. దీనిలో రూ.18 లక్షల పనులు పూర్తి అయ్యాయి.రూ. 20 లక్షల పనులు చేపట్టాల్సి ఉంది.రెండో విడతలో రూ.42.50 లక్షల వ్యయంతో 3 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. కారంచేడు గ్రామంలో మొత్తం రూ.2.49 కోట్ల వ్యయంతో 16 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో మొదటి విడతలో రూ.1.40 కోట్ల వ్యయంతో 7 వర్క్ లు పూర్తి అయ్యాయి. రెండో విడతలో రూ.1.09 కోట్ల వ్యయంతో 9 వర్క్ లకు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. యర్రంవారిపాలెంపాలెం గ్రామంలో మొత్తం రూ.10 లక్షల వ్యయంతో 1 వర్క్ కు నిధులు మంజూరు అయ్యాయి.ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది.

# చంద్రబాబు దూరదృష్టి, ఆంధ్రప్రదేశ్‌కు వరప్రసాదం..

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి..

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 15**

గూగుల్ ఏర్పాటు కోసం నిరంతరం సంప్రదింపులు జరిపిన మంత్రి నారా లోకేష్. సిఆర్డీఏ కార్యాలయం ప్రారంభం, గూగుల్ డేటా సెంటర్ ఒప్పందం – దీపావళి కానుకగా ఆంధ్రప్రజలకు రెండింతల ఆనందం! ఢిల్లీ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి నూతన దిశను చూపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రం మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసుకుంది. నిన్న అమరావతిలో సిఆర్డీఏ కార్యాలయాన్ని ప్రారంభించి రాజధాని అభివృద్ధికి నూతన శక్తిని అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఈరోజు విశాఖలో గూగుల్ సంస్థతో చారిత్రక ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ సాంకేతిక పటంలో నిలబెట్టారని, గూగుల్ ఏర్పాటు కోసం మంత్రి నారా లోకేష్ నిరంతరం సంప్రదింపులు జరిపారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటన అనంతరం ఉండవల్లిలోని ఆయన నివాసంకు చేరుకున్న చంద్రబాబు నాయుడుని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మర్యాదపూర్వకంగా కలుసుకొని, మొక్కను బహుకరించి. ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో చేసిన విశేష కృషికి శుభాకాంక్షలు తెలిపి, నవ్యాంధ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న చంద్రబాబు నాయుడుకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దారి చూపే దార్శనికుడు చంద్రబాబు నాయుడని, ఆయన దూరదృష్టి, సాంకేతిక



దృక్పథం వల్లే ఈ రోజు రాష్ట్రం గర్వించదగిన రెండు మైలురాళ్లను చేరుకుందన్నారు. అమరావతిలో సిఆర్డీఏ కార్యాలయం ప్రారంభం మరియు విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఒప్పందం. ఇవి రెండు కూడా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు మార్గాన్ని నిర్ణయించే చారిత్రక నిర్ణయాలన్నారు. విశాఖలో రూ.87,520 కోట్ల భారీ పెట్టుబడులతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు అవ్వడం రాష్ట్రానికి ఆర్థిక, సాంకేతిక, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తుందన్నారు. గూగుల్ ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టడం ఇదే తొలిసారి కావడం గర్వకారణమని పేర్కొన్నారు. విశాఖను అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా నిలబెట్టే ఈ ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌కు నిజమైన దీపావళి కానుక" అని గళ్ళా మాధవి పేర్కొన్నారు. నిన్న అమరావతిలో సిఆర్డీఏ కార్యాలయం ప్రారంభమై రాజధాని కల మళ్లీ జోరందుకోగా, ఈ రోజు గూగుల్ డేటా సెంటర్ ఒప్పందం రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. ఆంధ్ర ప్రజలకు దీపావళి పండుగ ముందుగానే వచ్చేసిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# ఆక్వా పార్క్, ఓడరేవు నిర్మాణం ద్వారా మత్స్య,ఆక్వా రంగం మరింత అభివృద్ధి కానుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 15**

బుధవారం,నిజాంపట్నం మండలంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్, ఓడరేవు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పరిశీలించారు. నిజాంపట్నం మండలం,యామినేనివారిపాలెంలో 192.42 ఎకరాలలో ఆక్వా పార్క్ అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఈ ఆక్వా పార్క్ వలన మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. మత్స్య సంపద అభివృద్ధికి ఈ పార్క్ కేంద్రం కానుందన్నారు. ఆక్వా పార్క్ అభివృద్ధికి టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించకపోవుటకు కారణాలను, అడ్డంకులపై మేరటైన్ బోర్డు అధికారులను ఆయన ఆరా తీశారు. ఆక్వా పార్క్ అభివృద్ధి ప్రాంతంలో చిల్ల మొక్కలను తొలగించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు టి వి వి ఎస్ యన్ కాంట్రాక్టర్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. పార్కు అభివృద్ధికి నిధులు మంజూరైనాయని పనులను వెంటనే ప్రారంభించి ఒక సంవత్సరంలోపు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నిజాంపట్నంలోని ఓడరేవు అభివృద్ధి పనులకు 2022 సంవత్సరంలో అగ్రిమెంట్ తీసుకొని, ఇప్పటివరకు పనులు పూర్తి చేయకపోవుటకు గల కారణాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధికారులను ఆరా తీశారు. ఓడరేవులో జెట్టి నిర్మాణ పనులు పూర్తయినాయని, బ్యాక్ వాటర్ పనులు ప్రారంభించి మూడు మాసములలో పూర్తి చేస్తామని అధికారులు ఆయనకు వివరించారు. పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఆక్వా పార్కు మరియు ఓడరేవు అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులతో వాట్సఅప్ గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. ఆక్వా పార్క్ మరియు ఓడరేవు పనుల పురోగతిపై ప్రతి బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని జిల్లా కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జె డి శ్రీనివాస్ నాయక్, ఉప సంచాలకులు గారి దేవుడు, రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మి, నిజాంపట్నం ఇన్చార్జి తహసిల్దార్ శ్రీనివాసరావు, మేరటైన్ బోర్డు డి.ఈ సూర్యనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జోగి రమేష్ ని వెంటనే అరెస్టు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలి -రాచకొండ లక్ష్మయ్య..

**పెన్ పవర్ గుంటూరు, అక్టోబర్, 14.**

ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలని కుట్రతో మాజీ మంత్రి జోగి రమేష్ చేసిన దుర్మార్గాన్ని తీవ్రంగా ఖండిస్తూ దీన్ని వెనక ఎవరైతే ఉన్నారో వారిపై కూడా కఠినమైన చర్యలు తీసుకోవాలని లక్ష్మయ్య కోరారు ఈరోజు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అరాచక విధ్వంస పాలన పై ప్రజలు విసిగి చెందిన 11 సీట్లకు పరిమితం చేసినప్పటికీ ఇతను పరివర్తన లేకపోవడం, కూటమి ప్రభుత్వం పై ప్రజలు చూపుతున్న ఆదరణ చూసి ఓర్వలేక, రాష్ట్ర అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తుంటే ఏదో విధంగా ప్రభుత్వంపై బురద జల్లడానికి నకిలీ మద్యం కుంభకోణం ముఖ్యమంత్రి చంద్రబాబుపై మరో డ్రామా జోగి రమేష్ తో మొదలుపెట్టించాడని, తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుట్రలను తిప్పికొట్టారు. నకిలీ మద్యం కుంభకోణం పై ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ తక్షణమే స్పందించి దోషులను ఎంతటి వారైనా, ఏ పార్టీ వారైనా చూడవద్దని, తక్షణమే అరెస్టులు చేసి కేసులు నమోద చేయాలని, అందులో భాగంగానే తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వారి పేర్లు బయటికి రావడంతో పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగిందని, ప్రభుత్వపరంగా సిట్ కమిటీ ఏర్పాటు చేసి లోతుగా విచారం చేయాలని, జోగి రమేష్ కనుసన్నల్లో వారి మనుషులతో ఎక్సైజ్ శాఖకు లీకులు ఇచ్చి





మొలకలచెరువు లో దాడులు చేయించారని,గత వైసీపీ పాలలో జరిగిన మద్యం కుంభకోణ కేసులు వైసీపీ నాయకులపై ఉన్న కేసులు డైవర్ట్ చేయడం కోసమేఈ ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ఒక ప్లాన్ ప్రకారం ఈ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి మాజీమంత్రి జోగి రమేష్ కంకణం కట్టుకున్నాడని లక్ష్మయ్య ఆవేదన అర్థం చేశారు, ఇబ్రహీంపట్నం నుండి సామాగ్రిని ములకలచెరువు గోడౌన్ కి అన్ని ఏర్పాట్లు చేసి ఎక్సైజ్ శాఖ ద్వారా సాక్షి మీడియా విలేకరుల ముందే ఏర్పాటు చేసి దాడులు చేయించారని, కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు కు నారా లోకేష్ కి సంబంధాలు ఉన్నాయని పుట్రా చేసిన మాజీ మంత్రి జోగు రమేష్ ప్రకటించడం వెనుక జగన్మోహన్ రెడ్డి పాత్ర కనపడుతుందని, నేడు జనార్ధన్ రెడ్డి అన్ని విషయాలు మీడియా ముందు చెప్పిన తర్వాత సిబిఐ విచారణకు జోగు రమేష్ డిమాండ్ చేయడం వెనుక అసలు కథ బయటపడిందని లక్ష్మయ్య అన్నారు. జగన్మోహన్ రెడ్డి పై ఉన్న సిబిఐ కేసులు, వివేకానంద రెడ్డి హత్య కేసు, సిబిఐ ఏమి చేయలేకపోయిందని ఉద్దేశంతో మద్యం కుంభకోణంలో ఉన్న మిథున్ రెడ్డి, నకిలీ మద్యం కుంభకోణం లో ఉన్న జోగి రమేష్ సిబిఐ పాట పాడుతున్నారని లక్ష్మయ్య ఎద్దేవా చేశారు. రోజురోజుకీ వైసీపీ ఉనికి కోల్పోవడంతో ఈ వైసిపి నాయకులు తప్పుల మీద తప్పులు చేసి ప్రజల్లో అభాసుపాలు అవుతున్నారని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు.

# కారంపూడి శ్రీచక్ర సిమెంట్స్ కు బెస్ట్ క్వాలిటీ అవార్డు

## వరల్డ్ స్టాండర్డ్స్ డే సందర్భంగా భారతీయ ప్రామాణికల సంస్థ ద్వారా సర్టిఫికెట్ స్వీకరించిన శ్రీ చక్ర సిమెంట్ యాజమాన్య ప్రతినిధులు



**పెన్ పవర్ కారంపూడి అక్టోబర్ 15**

పల్నాడు జిల్లా కారంపూడి శివారులోని శ్రీ చక్ర సిమెంట్స్ కు బెస్ట్ క్వాలిటీ అవార్డు దక్కింది. గత నలభై సంవత్సరాలుగా సిమెంట్స్ రంగంలో దేనిలోను రాజీ పడకుండా వినియోగదారులకు నాణ్యత కలిగిన సిమెంట్‌ను అందిస్తూ ఎంతో పేరు ప్రాఖ్యతలు శ్రీచక్ర సిమెంట్స్ యాజమాన్యం దక్కించుకుందని ఈ నేపథ్యంలో వరల్డ్ స్టాండర్డ్స్ డే సందర్భంగా భారతీయ ప్రామాణిక సంస్థ ద్వారా బెస్ట్ క్వాలిటీ అవార్డు శ్రీచక్ర సిమెంట్స్ కు దక్కింది. ఈ తరహా అవార్డు శ్రీచక్ర సిమెంట్స్ కు దక్కటం మూడవసారి. ఈ సందర్భంగా శ్రీచక్ర ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంస్థ ఎన్నో సంవత్సరాలు గా అందరిస్తూ వస్తున్నా కాస్టమర్లకు, వినియోగదారులకు, పంపిణిదారులకు, మార్కెటింగ్ సభ్యులకు తాము ఎప్పుడు రుణపడి ఉంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. శ్రీచక్ర సిమెంట్స్ ఇంత క్వాలిటీ అందిస్తున్నమంటే దానివేనుక యాజమాన్య నిరంతర శ్రమ, ఉద్యోగస్తులు కఠోర శ్రమ, ముఖ్యంగా మార్కెటింగ్ కృషి నేపథ్యంలోనే ఈ అవార్డు దక్కినట్లు ఆయన తెలిపారు. రానున్న రోజులలో మరింత మంచి క్వాలిటీ నాణ్యత అందించడంలో రాజీ పాడబొమని ప్రతిఒక్క కస్టమర్లకు, వినియోగదారులకు, పంపిణిదారులకు తాము జవాబుదారిగా ఉంటామని శ్రీచక్ర సిమెంట్స్ ఎప్పటికి నాణ్యత విషయంలో రాజీపడదని ఎన్నో సంవత్సరాల నుండి మమ్మల్ని అదరిస్తున్న ప్రజలకు, వినియోగదారులకు, మార్కెటింగ్ వారికీ ఈ సందర్భంగా శ్రీచక్ర సంస్థ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయ సాధనకు పునరంకితం

**మేధ శ్రీనివాసరావు**



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 15**

భారత ప్రజల రాష్ట్రపతిగా అభిమానించబడె భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం నాడు బాపట్ల మున్సిపల్ ఆఫీస్ దగ్గర అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల అలంకరించి వారి ఆశయ సాధనకు పునరంకితమవుతామని సమాజవాది పార్టీ బాపట్ల అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సందర్భంగా మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన కలాం మిస్సైల్ మాన్ గా భారతదేశం గర్వించే రాష్ట్రపతిగా ప్రజల మన్నలను పొందారని వారికి విద్య విద్యార్థులు యువజను ల పట్ల ఉన్న ఆసక్తి ప్రోత్సహం అక్టోబర్ 15 ను ప్రపంచ విద్యార్థి దినముగా జరుపుకోవడం జరుగుతుంది. అబ్దుల్ కలాం తరచుగా కలలు కనండి వాటిని నిజం చేయండి అని బోధించేవారు వారి ఆశయాలు సాధించుట వారికి ఘనమైన నివాళి అని చెప్పారు ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ప్రసాద్ రావు కాండ్రు శరత్ కుమార్ మోర్ల చిన వెంకటేశ్వరరావు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే

## జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ






**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 15**

జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ ఎ ఎన్ యమ్స్, ఆషా వర్కర్స్ బాపట్ల మున్సిపల్ హై స్కూల్ బాల బాలికలు స్కూల్ వద్ద నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ మాట్లాడుతూ...గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ భోజనం చేసే ముందు చేతులు కడుకోవాలని మన చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని చేతులు కడుక్కోకుండా ఆహారం సేవిస్తే రోగాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. అపరిశుభ్రమైన చేతుల ఆరోగ్యానికి హానికరం చేస్తాయని స్వచ్ఛమైన చేతులు ఎక్కడ ఉంటాయో అక్కడ ఆరోగ్యం ఉంటుందని అన్నారు. చేతులను కడిగి పెట్టుకుని రోగాలను తరిమికొట్టాలని భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రత తప్పనిసరి అని కాబట్టి ప్రతి ఒక్కరూ ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ డిఎంహెచ్వో, ఎంఈఓ, డాక్టర్, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కిమ్స్ ఎండి డాక్టర్ భాస్కర్ రావు ని కలసి కృతజ్ఞతలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

**పునర్జన్మ కల్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటికి హృదయపూర్వక కృతజ్ఞత అభినందనలు..మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని**

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 15:**

మాజీమంత్రి స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సిఫార్సుతో తనకు మెరుగైన వైద్య చికిత్స అందించిన హైదరాబాద్ లోని కిమ్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ భాస్కర్ రావు ని కలసి మెమెంటో పూల మొక్కను అందించి కృతజ్ఞతబివందనలు తెలిపినట్లు చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు తెలియజేసింది ఏమనగా తనకు తీవ్రమైన గ్యాస్టిక్ సమస్యకు హైదరాబాద కిమ్స్ హాస్పిటల్ ఎండి. డాక్టర్ భాస్కర్ రావు పర్యవేక్షణలో గ్యాస్టిక్ స్పెషలిస్టు డాక్టర్ అజిత్, స్పెషాలిటీ సర్జన్ అర్ ఎ శాస్త్రి ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు సిఫార్సు తో ప్రత్యేక శ్రద్ధ తో శస్త్ర చికిత్స చేసి తన ప్రాణాలు కాపాడారనీ వారికి మన మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు తరుపున నేను స్వయంగా కిమ్స్ హాస్పిటల్ కు వెళ్లి వారికి మెమెంటోలు బహుకరించి కృతజ్ఞతలు తెలియజేసి,మా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సిఫార్సుతో వచ్చిన ప్రతి వక్కరికి ఇదే విధముగా ప్రత్యేక చొరవ తీసుకొని వైద్య సేవలు అందించాలని కిమ్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ భాస్కర్ రావు ను కోరినట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పేర్కొన్నారు.అంతే కాకుండా మా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తో చర్చించి చిలకలూరిపేటలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని, ఆ వైద్య శిబిరానికి కిమ్స్ హాస్పిటల్ ఎండి డాక్టర్ భాస్కర్ రావుని రావాలని ఆహ్వానించగా వారు తప్పకుండా వస్తానని మాట ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సిఫార్సుతో కిమ్స్ హాస్పిటల్ మేనేజ్మెంట్ అనుక్షణం నా పై ప్రత్యేక చొరవ తీసుకోవడం వల్లే నేను నేడు ఈ విధముగా మీ ముందు ఉన్నాని, మళ్లీ నాకు పునర్జన్మ కల్పించిన మాజీమంత్రి స్థానిక శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు కి జీవితాంతం రుణపడి ఉంటానని ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞత అభినందనలు మీడియా ముఖంగా తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు.



# ముక్కొల్లు గ్రామపంచాయతీకి వరాలు కురిపించిన జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక (రాము)









**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్) అక్టోబర్ 15:**

గూడూరు మండలం ముక్కొల్లు గ్రామ పంచాయతీకి జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక (రాము) వరాలను కురిపించారు. బుధవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టగా ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమ్మెట జయవర్ధన్, ఎంపీటీసీ యర్రం శెట్టి శ్రీనివాసరావు,వైస్ సర్పంచ్ సమ్మెట చంతన్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కాంట్రాక్టర్ కృష్ణంరాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జయవర్ధన్ మాట్లాడుతూ....జిల్లా పరిషత్ నిధుల నుండి గ్రామపంచాయతీకి ఆర్డబ్ల్యూఎస్ చెరువుకి ఫిల్టర్ మీడియం కి రూ 20 లక్షలు చెరువు చుట్టూ ఫెన్సింగ్ కి 20 లక్షలు ముక్కొల్లు గ్రామపంచాయతీలో ఉన్న జిఎస్పి రోడ్లో అభివృద్ధికి నిర్మాణానికి 12 లక్షలు సీసీ రోడ్ 8 నర్ర లక్షలు స్మశాన షెల్టర్ 5 లక్షలు కేటాయించారు. గ్రామపంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను కేటాయించి పంచాయతీ అభివృద్ధికి సహకరించిన జిల్లా పరిషత్ చైర్పర్సన్ ను గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు గ్రామస్తులు అభినందించారు.

# క్యాంపు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించిన కరణం వెంకటేష్





**చీరాల, పెన్ పవర్, అక్టోబర్ 15**

చీరాల నియోజకవర్గ ఇంచార్జి కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం చీరాల మండలంలోని రామకృష్ణపురం గ్రామంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న పిపిపి విధానానికి వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ... "ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజల వైద్య హక్కులను దూరం చేయడానికి పిపిపి విధానాన్ని అమలు చేస్తోంది. ఈ విధానం వల్ల సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స దూరమవుతుంది, అలాగే పేద విద్యార్థులకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విద్యా అవకాశాలు తగ్గిపోతాయి" అని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా ఈ పోస్టర్ ఆవిష్కరణ చేశామని, మొదటి సంతకం తానే చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి, వాటిపై పర్యవేక్షకులను నియమించనున్నట్లు తెలిపారు. "ఇది కేవలం కార్యక్రమం కాదు, ప్రజా ఉద్యమం. ప్రతి కార్యకర్త, నాయకుడు దీన్ని ప్రజలకోసం పోరాటంగా తీసుకోవాలి" అని పిలుపునిచ్చారు. చీరాల ప్రజలకు హామీ ఇస్తూ... "నేను ఎప్పటికీ చీరాల నియోజకవర్గంలోనే ఉంటాను. 2029 ఎన్నికల్లో వైఎస్సార్సీపీ తరఫున చీరాల నుంచే పోటీ చేస్తాను. ఎవ్వరూ అపోహలు పెట్టుకోవద్దు" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జైసన్ బాబు, గవిని శ్రీను, కీర్తి వెంకటరావు, కంపా అరుణ్, హెచ్. రమేష్, రాజు వెంకటేశ్వరరెడ్డి, బొడ్డు సుబ్బారావు, సాధు రాఘవ, రమణారెడ్డి, సీతా మహాలక్ష్మి, చిన్ని లీలధర్, చీమకుర్తి బాలకృష్ణ, కబీర్, యాతం మేరీబాబు, ఖాదర్, పి. శ్రీనివాసరెడ్డి, సాంబిరెడ్డి, అంకాలరెడ్డి, బిట్ర శ్రీనివాసరావు, దంతం వెంకట సుబ్బారావు, ఆవుల కొండలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా పోలీస్ అధికారులు





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 15**

జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ అధికారులు వారి పరిధిలోని పాఠశాలలు, కళాశాలలలోని విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాలలో శక్తి యాప్ వినియోగించుకోవాల్సిన విధానం, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల బారిన పడకుండా ఎలా అప్రమత్తంగా వ్యవహరించాలి, రోడ్డు భద్రతా నియమాలు, ఈవ్ టీజింగ్, మహిళా సంబంధిత చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. జిల్లాలోని శక్తి బృందాలు సైతం ఈ కార్యక్రమాలలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ మాట్లాడుతూ శక్తి యాప్ మీ మొబైల్లో ఉంటే మీతో పాటుగా ఒక పోలీస్ తోడుగా ఉన్నట్లేనని, అత్యవసర సమయాల్లో మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని, ఇది మహిళలకు ఒక శక్తివంతమైన ఆయుధం లాంటిదని తెలిపారు. విద్యార్థి దశలో నుండే మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఎంతోమంది గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలై వారి అమూల్యమైన జీవితాలను పాడు చేసుకుంటున్నారని తెలిపారు. నేటి సమాజంలో నానాటికి సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిని నిరోధించాలంటే అవగాహన అతి ముఖ్యమైన మార్గమని, ప్రతి విద్యార్థి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఇతరులను కూడా చైతన్యపరచాలని సూచించారు. విద్యార్థి దశ నుండే రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కలిగి ఉంటే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎలా వ్యవహరించాలి తెలుస్తుందన్నారు. ఈవ్ టీజింగ్ అనేది ఒక ఆటవిక చర్య అని, స్కూల్స్, కాలేజీల స్థాయిలో దానిని పూర్తిగా నియంత్రించాలని, ఎవరైనా ఈవ్ టీజింగ్కి పాల్పడితే వారి మీద కేసు నమోదవటం వలన వారి భవిష్యత్ అంధకారంగా మారుతుందని తెలిపారు. మహిళల పట్ల గౌరవప్రదంగా నడుచుకోవాలని, ఎవరైనా మహిళా సంబంధిత నేరాలకు పాల్పడితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకొని కఠిన శిక్షలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దేశ సేవలో వీరమరణం పొందిన మేజర్ టీ.స్.టీ. భరద్వాజ్ కి ఘన నివాళులు అర్పించిన.. ఎస్పీ వకుల్ జిందాల్...

**పెన్ పవర్, గుంటూరు,అక్టోబర్, 15**



లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగడి గుంట గ్రామానికి చెందిన మేజర్ టీ.స్.టీ. భరద్వాజ్ భారతీయ ఆర్మీలో మేజర్గా విధులు నిర్వర్తిస్తున్నారు. నిన్నటి రోజు (14.10.2025) రాజస్థాన్లోని సైనిక శిబిరంలో యుద్ధ విన్యాసాలు జరుగుతుండగా జరిగిన ప్రమాదంలో ఆయన వీరమరణం పొందారు. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మేజర్ భరద్వాజ్ నివాసానికి వెళ్లి, ఆయన పార్థివ దేహానికి పోలీస్ శాఖ తరపున వందనం సమర్పించి ఘన నివాళులు అర్పించారు. దేశ రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తూ దేశ సేవలో అసువులు బాసిన మేజర్ భరద్వాజ్ అందరికీ స్ఫూర్తిదాయకులని ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. శత్రువుల నుండి దేశాన్ని రక్షించడంలో ఆయన కనబరిచిన ధైర్యం, దేశానికి సేవ చేయాలనే అచంచల సంకల్పం, త్యాగం, నిరంతర కృషి ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతుందని తెలిపారు. మేజర్ టీ.స్.టీ. భరద్వాజ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ మేజర్ తండ్రి ఉపేంద్ర కుమార్ మరియు కుటుంబ సభ్యులతో మాట్లాడి, ధైర్యం చెప్పారు.అనంతరం వీరుని అంతిమ యాత్రలో పాల్గొనీన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి. శ్రీనివాసులు ,గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ , ఇతర పోలీస్

## బంగారు కుటుంబనికి చేయిత



**చిన్నగంజాం, పెన్ పవర్, అక్టోబర్ 15**

పేదల సాధికారత,పేదరిక నిర్మూలన కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పీ-4 అనే మహత్తర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్త గోల్లపాలెంలోని దత్తత తీసుకున్న 15 బంగారు కుటుంబల్లోని గోనుబోయిన వెంకటేశ్వరమ్మ కుమార్తె, కుమారుడు అయిన గౌతమ్,దుర్గాభవానీలకు బుధవారం మార్గదర్శి అయిన ప్రముఖ పారిశ్రామికవేత్త, లాయిడ్ పార్మా అధినేత విక్రమ్ నారాయణరావు సమకుర్చిన 58 వేల రూపాయల ఫీజును బాపట్ల జిల్లా తెదేపా వాణిజ్య విభాగ అధ్యక్షుడు కోండ్రగంటి శ్రీహరి రావు మరియు మండల ఎపిఎమ్ జి.సుబ్బారావు చేతుల మేదగా ప్రిన్సిపాల్ యేసు దయానందకు అందజేశారు.సమాజంలో సంపద పెరుగుతున్నా, అది పేదవారికి అందని ఇ పరిస్థితిలో 15బంగారు కుటుంబలను దత్తత తిసుకోని అందరికీ మార్గదర్శిగా నిలిచిన విక్రమ్ నారాయణరావుని కాలేజ్ యాజమాన్యం,పలువురు ప్రముఖులు అంభినందించారు.

## హెడ్ వాటర్ వర్క్స్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి.. కమిషనర్ పులి శ్రీనివాసులు..





**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 15.**

గుంటూరు నగరానికి త్రాగునీటిని అందించే హెడ్ వాటర్ వర్క్స్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సిబ్బంది మినహా ఇతరులను లోనికి రానివ్వద్దని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ జిఎంసి హెడ్ వాటర్ వర్క్స్, మానససరోవరం దగ్గర కల్వర్ట్, ఆర్టీసి కాలనీ, చిన్నేరు కుంట, కోబాల్ట్ పేటలో పీకలవాగు ఆక్రమణలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు త్రాగునీటిని అందించే కీలకమైన హెడ్ వాటర్ వర్క్స్ లో ఇతరులు రాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సిసి కెమెరాలతో వాటర్ వర్క్స్ ప్రాంగణం పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే కృష్ణా నది నుండి వచ్చే నీటిని నిర్దేశిత శాస్త్రీయ విధానంలో శుద్ధి చేసి, ల్యాబ్ లో తనిఖీ చేసిన అనంతరమే సరఫరాకి పంపింగ్ చేయాలన్నారు. ల్యాబ్ లో ప్రతి రిపోర్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. హెడ్ వాటర్ వర్క్స్ లో మోటార్లు, ఇతర యంత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మానస సరోవరం దగ్గర సర్వీస్ రోడ్ వెంబడి కల్వర్ట్ చిన్నదిగా ఉండడం వలన వర్షం నీరు రోడ్ మీదకు వస్తుందన్న ఫిర్యాదు మేరకు పరిశీలించి, నేషనల్ హైవే అధారిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిన్నేరు కుంట ఆక్రమణలను, కోబాల్ట్ పేటలో పీకలవాగు ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో డిఈఈ రమేష్ బాబు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్‌గా భావన వశిష్ట





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 15:**

ప్రజలలో భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. కలెక్టరేట్ కు చేరుకున్న జిల్లా సంయుక్త కలెక్టర్ కు బుధవారం ఘన స్వాగతం లభించింది. డి ఆర్ ఓ గంగాధర్ గౌడ్, జిల్లా కలెక్టరేట్ ఏ ఓ. మల్లిఖార్జునరావులు పుష్పగుచ్చాలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్చారణ, పూర్ణ కుంభంతో స్వాగతిస్తూ కార్యాలయంలో పూజలు నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ గా భావన వశిష్ట బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలసిన సంయుక్త కలెక్టర్ పుష్పగుచ్చాలను అందజేశారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లా సంయుక్త కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. బాపట్ల జిల్లాకు సంయుక్త కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. ప్రభుత్వ పథకాలన్నీ జిల్లాలోని పేద ప్రజలకు అందేలా చూస్తామన్నారు. ముఖ్యంగా రెవిన్యూ వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడకుండా పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా సాగేలా చూస్తామన్నారు. 2019 ఐఏఎస్ బ్యాచ్ గా వివిధ ప్రాంతాల్లో పనిచేశానన్నారు. ఇంతకు ముందు కృష్ణా జిల్లాలో ఏసి యుటి గాను, పార్వతీపురంలో సబ్ కలెక్టర్ గాను, జిఎస్ ఎస్ డబ్ల్యు ఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ గాను, జిల్లాలో సంయుక్త కలెక్టర్, రిటర్నింగ్ అధికారిగాను పని చేసిన అనుభవం ఉందన్నారు. కాకినాడలో మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తుండగా బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ మేరకు ఇక్కడకు వచ్చామని, ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు పి.గ్లోరియా, చంద్రశేఖర్ నాయుడు, యన్.రామలక్ష్మి, బాపట్ల మండలం తహశీల్దార్ సలీమా షేక్, జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## బాపట్ల పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంగారావు తనిఖీలు



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 15**

బాపట్ల పట్టణంలోని పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ వాహనాలను తనిఖీ చేసిన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంగారావు, వాహనదారులకు ముఖ్యమైన సూచనలు చేశారు.అన్ని వాహనాలలో తప్పనిసరి పత్రాలు ఎప్పుడూ ఫోర్స్లో ఉంచుకోవాలి. ప్రయాణ సమయంలో తప్పక సిటీ బెల్టు ధరించి వాహనాలు నడపాలి.అధిక లోడు అధిక పాసింజర్లను వాహనాల్లో ఎక్కించరాదని అన్నారు. ఈ సూచనలు ప్రయాణ సురక్ష కోసం ప్రత్యేకంగా ఇచ్చారు.ఈ విధంగా జాగ్రత్తలు పాటిస్తే, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని, ప్రయాణికుల సురక్షితమైన ప్రయాణం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ప్రమాద నివారణ, విధానాల అమలుకు ఇదివరకే ఎన్నిరోజుల నుంచి తనిఖీలు కొనసాగుతున్న విషయం తెలియజేశారు.

## భారతరత్న అబ్దుల్ కలాంకి ఘణ నివాళులు



**చిన్నగంజాం , పెన్ పవర్ అక్టోబర్ 15**

ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు, యువతకు మార్గ నిర్దేశకుడు, జీవితాంతం దేశ ప్రతిష్ట కోసం తపించిన దేశభక్తుడు భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మండలంలోని స్థానిక మసీద్ పేట ముస్లిం సోదరులు ఘణంగా నివాళులు అర్పించారు.ఇ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కలాం దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షుడు పఠాన్ సుభానిఖాన్, షేక్ ఈసుబ్, మసీద్ ప్రెసిడెంట్ నబీషా, షేక్ అన్వార్, షేక్ జియావుల్ హక్కు, పటాన్ బాబు, లక్ష్మణ్, బాలాజీ, ఇర్ఫాన్, జాకీర్, షఫీ, భాషా, పాంటింగ్, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా లో 308 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల అక్టోబర్ 15**



జిల్లాలో యూరియా కొరత లేదన్నా సమాచారాన్ని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలియజేయాలి. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జిల్లాలో యూరియా కొరత లేదన్నా సమాచారాన్ని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ముందురోజే తెలియజేయాలని,జిల్లాలో 308 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాయులో ఉందని రైతులు వచ్చి యూరియా తీసుకొనివెళ్ళవచ్చునని జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం బాపట్ల జిల్లా లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్ ఎస్ కె లు మరియు పి ఏ సి ఎస్ కేంద్రాల 37 ద్వారా 412 మెట్రిక్ టన్నుల యూరియా ను 4786 మంది రైతులకు పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా 308 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటు లో ఉందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జనసేన పార్టీ కార్యాలయంలో పత్రికా సమావేశం

**పెన్ పవర్, గుంటూరు, అక్టోబర్, 15.**



ఈరోజు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు లాడ్జి సెంటర్లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తురకపాలెం గ్రామంలో జరిగిన దురదృష్టకరమైన సంఘటనను వైసిపి నాయకులు రాజకీయంగా వాడుకోనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బుధవారం రోజు వైసీపీ నాయకులు తురకపాలెం గ్రామంలో పరామర్శ పేరిట కులాల మధ్య గొడవలు పెట్టే ప్రయత్నం చేశారని అన్నారు. తురకపాలెం గ్రామంలో వైసిపి నాయకులు బలసాని కిరణ్ కుమార్, పోతిన మహేష్, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యటించి కూటమి ప్రభుత్వం మీద లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేశారని అన్నారు. బలసాని కిరణ్ ప్రతిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ అయినప్పటికీ తురకపాలెం ప్రజల పట్ల నిర్లక్ష్యం వహించారని అన్నారు. బాధలో ఉన్న తురకపాలెం గ్రామాన్ని సందర్శించే ప్రయత్నం కూడా చేయలేదని, పరిస్థితి అంతా చక్కబడిన తర్వాత తాపీగా వచ్చే రాజకీయాలు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవ చేశారు. గతంలో ఇదే మాదిరిగా ఎక్కడి నుంచో సిదిరి అప్పలరాజు ఒక బృందంతో వచ్చి హడావుడి చేసే ప్రయత్నం చేసి విఫలమయ్యారని అన్నారు. ఇప్పుడు మళ్లీ ఇంకో బృందాన్ని తీసుకొని వచ్చి తురకపాలెం గ్రామంలో అశాంతి నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తురకపాలెం గ్రామం చాలా ప్రశాంతంగా ఉందని, కులమతాలకు అతీతంగా అన్ని విధాలుగా కలిసిమెలిసి బతుకుతున్న గ్రామస్తుల మధ్య గొడవలు పెట్టి రాజకీయ లబ్ది పొందాలని వైసీపీ నాయకులు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వచ్చిన నలుగురు నాయకులు మూడు రకాలుగా మాట్లాడారని, ఒకరు కోటి రూపాయల పరిహారం ఇమ్మని, మరొకరు 50 లక్షలు ఇమ్మని, ఇంకొకరు 5 లక్షలు మాత్రమే ఇచ్చారని ఇష్టం వచ్చినట్టు మాట్లాడారని అన్నారు. గుంటూరు జిల్లా వైఎస్ఆర్సిపి పరిశీలకుడు మరియు గతంలో జనసేన పార్టీ నుంచి వైసీపీలో చేరిన పోతిన మహేష్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఎక్కడికైనా వచ్చేటప్పుడు కనీసం అక్కడ పరిస్థితుల గురించి తెలుసుకొని వచ్చి మాట్లాడితే సబబుగా ఉంటుందని, అలాకాకుండా మీడియాలో కనబడడానికి రాజకీయంగా వారి అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి నోటికి వచ్చినట్టు మాట్లాడితే గుంటూరు జిల్లా జనసేన పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఆ విషయం పోతిన మహేష్ కి స్పష్టంగా తెలుసు అని అన్నారు. అవగాహన లేకుండా మాట్లాడుతున్న పోతిన మహేష్ ని చూస్తుంటే బాధగా ఉందని అన్నారు. పవన్ కళ్యాణ్ మీద లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేయొద్దని స్పష్టంగా తెలియజేశారు. పవన్ కళ్యాణ్ పట్టించుకోలేదు అని చెప్పడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనం అని తెలియజేశారు. ఇప్పుడు పోతిన మహేష్ ఉన్న పార్టీ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తే, పంచాయతీలకు జీవం పోస్తూ, సర్పంచులకు ఒక విలువ కల్పించిన వ్యక్తి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ని అన్నారు. కానీ గతంలో వైసీపీ నాయకుడు జగన్ రెడ్డి వాలంటీర్లు అడ్డం పెట్టుకొని ఏ విధంగా పంచాయతీల నాశనం చేశారో పోతిన మహేష్ కి తెలుసని, జనసేన పార్టీలో ఉన్న సమయంలో ఆయన కూడా ఆ విషయం మీద మాట్లాడిన సందర్భాన్ని గుర్తు చేశారు. కాబట్టి పోతున్న మహేష్ పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడేటప్పుడు ఆలోచించుకొని మాట్లాడితే సబబుగా ఉంటుందని హెచ్చరించారు. అదేవిధంగా పల్లె పండుగ పేరుతో పవన్ కళ్యాణ్ ఏ విధంగా పంచాయతీరాజ్ వ్యవస్థలో సంస్కరణలు తీసుకువస్తున్నారో రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. దళితులకు అన్న, మేనమామ, బిడ్డ అని చెప్పుకునే జగన్ రెడ్డి ఒక గంట సమయం కేటాయించి వారిని పరామర్శించే ప్రయత్నం కూడా చేయలేదని అన్నారు. కూటమి నాయకులందరూ ఒకటికి పదిసార్లు తురకపాలెం గ్రామాన్ని సందర్శించి, వారిలో ధైర్యాన్ని నింపి, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయడం దగ్గరనుంచి వారికి భోజనం సదుపాయాలతో పాటు ప్రత్యేకంగా మంచినీటి సరఫరా కూడా చేయడం జరిగిందని అన్నారు. స్వయాన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పలుమార్లు తురకపాలెం గ్రామాన్ని పర్యటించి గ్రామస్తులకు ధైర్యం చెప్పారని, గ్రామం మీద ఆయనే ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. అదేవిధంగా స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు కూడా గ్రామంలో బసచేసి, గ్రామస్తులతో కలిసి భోజనం చేసి సమస్యను పరిష్కరించే వరకు హెల్త్ ఎమర్జెన్సీ లాగా పని చేశారని అన్నారు. అలాగే స్థానిక జనసేన పార్టీ నాయకులతో కలిసి తాము కూడా గ్రామంలో అనేకసార్లు పర్యటించామని, అలాగే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మరియు స్థానిక శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు బాధితులకు త్వరితగతన పరిహారం అందించే కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ఇంత చేస్తున్న కూటమి ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేసే విఫల యత్నాలు వైఎస్ఆర్సిపి పార్టీ చేస్తుందని అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కేవలం రాష్ట్ర అభివృద్ధి కోసం మాత్రమే కూటమి కట్టారని, ఆ దిశగానే కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అది చూసి ఓర్వలేని వైసీపీ పార్టీ లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ కూడా ఈ విషయాలన్నీ గమనించి జనసేన పార్టీకి అదేవిధంగా కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శిఖా బాలు, కొప్పుల కిరణ్, నక్కల వంశీ, చట్టాల త్రినాథ్, తురకపాలెం సర్పంచ్ డబ్బురి సూర్యప్రకాశ్, జనసేన నాయకులు లింగేశ్వరావు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గూగుల్ భారీ ఏఐ హబ్.. డేటా సెంటర్ ....

### రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చనున్నాయి. : ప్రత్తిపాటి

**గూగుల్ కమ్స్ టు ఏపీ.. దిస్ క్రెడిట్ గోస్ టూ విజనరీ లీడర్ సీబీఎన్. యంగ్ - డైనమిక్ లీడర్ నారా లోకేశ్ : ప్రత్తిపాటి**

**కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లో విశాఖకు రూ.6.50 లక్షల కోట్ల పెట్టుబడులు : ప్రత్తిపాటి.**

**వైసీపీ ప్రభుత్వంలో సాగర నగరం నిత్యం అసాంఘికత..అవినీతి..అలజడితో వణికిపోయింది. : ప్రత్తిపాటి.**

**చంద్రబాబు పాలనలో పెట్టుబడుల గమ్యస్థానంగా మారి, విశ్వనగరంగా మారబోతోంది : ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 15:**

గూగుల్ కమ్స్ టు ఏపీ... దిస్ క్రెడిట్ గోస్ టూ విజనరీ లీడర్ సీబీఎన్. యంగ్ - డైనమిక్ లీడర్ నారా లోకేశ్. ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వసనీయత, పట్టుదల ఫలితం ఎలా ఉంటుందో మరోసారి నిరూపితమైంది. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ విప్లవానికి నాంది పలికిన మైక్రోసాఫ్ట్ ను నాడు రాష్ట్రానికి తీసుకురావడంలో బాబు చేసిన కృషి అందరికీ తెలిసిందే. దానికి కొనసాగింపుగా .. తన అభివృద్ధి ఆలోచనల ప్రవాహంలో భాగంగా ప్రపంచ ప్రతిష్టాత్మక సంస్థ గూగుల్ .. నవ్యాంధ్రలో కాలుమోపనుంది. ఏపీ ప్రభుత్వం తాజాగా గూగుల్ తో చేసుకున్న ఒప్పందం దేశ సాంకేతిక రంగంలో నూతన విప్లవానికి నాంది పలకనుంది. గూగుల్ సంస్థ విశాఖపట్నంలో ఏర్పాటు చేయబోయే ఏఐ హబ్, డేటా సెంటర్ లు రాష్ట్ర ప్రగతి ప్రస్థానానికి కేంద్ర బిందువులు కానున్నాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఆకర్షణలో కీలకంగా నిలవనున్నాయి. వివిధ ప్రతిష్టాత్మక సంస్థల రాకకు మార్గం సుగమం కావడం.. రాష్ట్ర యువత భవితకు గొప్ప వరమనే చెప్పాలి. గూగుల్ సంస్థ సాగరతీరాన ఏర్పాటు చేయబోయే 1 గిగావాట్ ఏఐ హబ్ ప్రపంచంలో ఇదివరకు ఎక్కడా లేనిది.. దేశంలో మొదటిది. దీనిలో భాగంగా విశాఖలో రాబోయే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి (సుమారు 1.32 లక్షల కోట్లు) పెట్టనున్నట్టు గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ ప్రకటించడం గమనార్హం. గూగుల్ ఒప్పందం పాలకుల ప్రధాన ధ్యేయమైన విజన్ -2047 లక్ష్యసాధనకు ఎంతగానో దోహదపడనుంది.

**కూటమి ప్రభుత్వంలో విశాఖ పేరు విశ్వవ్యాప్తంగా మారుమోగుతోంది...**

చంద్రబాబు చరిష్మాతో సాగర నగరానికి భారీస్థాయిలో పెట్టుబడులు తరలివస్తున్నాయి. పారిశ్రామిక అంశాల ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ విశాఖ నగరం పేరు అంతర్జాతీయంగా పదేపదే వినిపిస్తోంది. తాజా గూగుల్ ఒప్పందంతో ఆ నగరం విశ్వనగరంగా ఖ్యాతి పొందనుంది. దిగ్గజ ఐటీ కంపెనీలు నగరం నుంచి కార్యకలాపాలు సాగించడానికి ఇప్పటికే క్యూ కడుతున్నాయి. ఈ నేపథ్యంలో గూగుల్ సంస్థ విశాఖలో ఏర్పాటు చేయబోయే ఏఐ హబ్, డేటా స్టోరేజ్ సెంటర్ లు ప్రపంచ సాంకేతిక రంగానికే ప్రగతి కేంద్రాలుగా నిలవనున్నాయి. గూగుల్ రైడెన్ రూ.1,33,200 కోట్ల పెట్టుడికి సిద్ధమైంది. ఆర్సెలార్ మిత్తల్ సంస్థ, విశాఖలో 1.35 లక్షల కోట్లతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో పాటు క్యాప్టివ్ పోర్టులను అభివృద్ధి చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్టీపీసీ రూ.1.80 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు చేయనుంది. వాటితో పాటు.. టీసీఎస్ ,1370 కోట్ల పెట్టుబడితో 12,000 మందికి ఉపాధి కల్పించడానికి సిద్ధమైంది. ఇంకా అదానీ, సిఫి, కాగ్నిజెంట్, యాక్సెంచర్, ఏ.ఎన్.ఎస్.ఆర్. సత్య డెవలపర్స్, ఫీనమ్ పీపుల్, ఉర్సా వంటి దిగ్గజ కంపెనీల విశాఖలో అడుగిడటానికి సిద్ధమయ్యాయి. వైకాపా ప్రభుత్వంలో భూ కబ్జాలు.. సెటిల్ మెంట్లు.. చోరీలు.దందాల..అసాంఘిక కార్యకలాపాలతో నిత్యం వార్తల్లో నిలిచిన విశాఖనగరం, కూటమి ప్రభుత్వంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల రాకకు సంబంధించిన వార్తలు.. కార్యక్రమాలతో నిత్యం ప్రపంచస్థాయిలో కొనియాడబడుతూ..పరిశ్రమల ఆకర్షణ కేంద్రంగా నిలుస్తోంది. మొత్తంగా విశాఖ..దాని చుట్టుపక్కలే వివిధ పరిశ్రమలు, ప్రధాన సంస్థల అంగీకారంతో ఇప్పటికే రూ.6.50 లక్షల కోట్ల పెట్టుబడులు, రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం నిజంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్.. కూటమిప్రభుత్వ ఘనతే.” అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## అబ్దుల్ కలాం జయంతి వేడుకల్లో పాల్గొన్న గౌరీ అమర్నాథ్


### విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత




**చీరాల, పెన్ పవర్, అక్టోబర్ 15**

మాజీ రాష్ట్రపతి, గొప్ప శాస్త్రవేత్త డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా చీరాల మసీద్ సెంటర్లోని అసిఫ్ అలీ ప్రైమరీ ఉర్దూ అండ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని అబ్దుల్ కలాం విగ్రహ సాధన కమిటీ మరియు అబ్దుల్ కలాం సేవా సమితి సంయుక్తంగా నిర్వహించగా, ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ హాజరయ్యారు. అమర్నాథ్ ముందుగా డా. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల అర్పించి, అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులతో కలిసి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. తరువాత ఆయన చేతుల మీదుగా విద్యార్థులు, విద్యార్థినులకు పుస్తకాలు, పెన్సిళ్ళు, పెన్నులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో అబ్దుల్ కలాం సేవా సమితి సభ్యులు షేక్ రియాజ్ భాషా, సయ్యద్ బాబు, షేక్ సలాం, షేక్ లాల్ అహ్మద్, షేక్ మొహిద్దిన్, షేక్ సుభాని, షేక్ అలీ, అలాగే మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, వైస్ చైర్మన్ పొత్తూరు సుబ్బయ్య, జనసేన నాయకులు గూడూరు శివరాం ప్రసాద్, బీజేపీ నాయకులు తడవర్తి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా బీసీ నేతలు



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 15**

పల్నాడు జిల్లా నూతన కలెక్టర్ కృతిక శుక్ల ను బుధవారం నాడు పల్నాడు జిల్లా బీసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా యువజన అధ్యక్షులు మాదాసు పృధ్వీరాజ్ సాయి కలెక్టర్ తో జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ వర్గాల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ఆలా శివ గోపి, బీసీ నాయకులు కాళహస్తి నవీన్ కుమార్, నక్కా గోపి, మాదాసు సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ నరసరావుపేట

**- ప్లాస్టిక్ రహిత పట్టణం వైపు మన అడుగు**

**-ప్లాస్టిక్ రహిత నరసరావుపేట కోసం ఆకస్మిక తనిఖీలు**

**- నిషేధిత క్యారీబ్యాగుల స్వాధీనం**

**పురపాల సంఘం కమిషనర్ యం. జస్వంత్ రావు**



**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 15**

నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలో బుధవారం నాడు ఆకస్మికంగా నిర్వహించిన ప్లాస్టిక్ అవగాహన మరియు నియంత్రణ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పురపాలక కమిషనర్ జస్వంత్ రావు ఆదేశాల మేరకు 3వ మరియు 4వ డివిజన్లు, సత్తెనపల్లి రోడ్డు నుండి మల్లమ్మ సెంటర్ వరకు, పలు దుకాణాలు, తోపుడు బండ్ల వద్ద నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ క్యారీబ్యాగులు స్వాధీనం చేయబడ్డాయి. సుమారు 20 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేయగా, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై మొత్తం రూ. 5200 జరిమానా విధించి పురపాలక ఖజానాకు జమ చేశారు. స్వాధీనం చేసిన ప్లాస్టిక్ కవర్లను పర్యావరణ నియమాల ప్రకారం గుంటూరులోని జిందాల్ ప్లాంట్‌కు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ జస్వంత్ రావు మాట్లాడుతూ : పట్టణ ప్రజలకు ఇప్పటికే పలు మార్లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన కల్పించామని, అయినప్పటికీ కొంతమంది వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదని, ఇకపై ప్రతి రోజు ఆకస్మిక రైడ్లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకొని, పర్యావరణహితమైన వస్తువులను ఉపయోగించాలని ప్రజలకు ఆయన సూచించారు. ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు చేతి సంచులు, వస్త్ర సంచులు, టిఫిన్ డబ్బాలు వంటి పునర్వినియోగ వస్తువులను తీసుకెళ్లాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. వ్యాపారులు కూడా వినియోగదారులను ప్లాస్టిక్ రహిత జీవనానికి ప్రోత్సహించాలని, పట్టణ పరిశుభ్రత మరియు పర్యావరణ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రమాదేవి, పర్యావరణ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చిలకలూరిపేటలో నాగేశ్వరరావు పెద్దకర్మ కార్యక్రమం



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 15**

జనసేన పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్ తండ్రి నాగేశ్వరరావు ఈ నెల 1వ తేదీన స్వర్గస్తులైనారు. ఈ రోజు వారి స్వగృహంలో జరిగిన పెద్దకర్మ కార్యక్రమానికి పలువురు జనసేన నాయకులు హాజరై, నాగేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, పెదకూరపాడు నియోజకవర్గ సమన్వయకర్త రామకృష్ణ, వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాస రాయల్, ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి నిస్సంకరావు శ్రీనివాసరావు, చిలకలూరిపేట యువ నాయకుడు మండలనేని చరణ్ తేజ, బంధనం జ్యోతి, ఎడ్లపాడు మండల ఉపాధ్యక్షులు మేకల రామారావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గాల మండల అధ్యక్షులు, జనసేన కార్యకర్తలు, అభిమానులు కూడా పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై చిలకలూరిపేట రూరల్ పోలీసుల దాడి

**ఆరుగురి అరెస్ట్, రూ. 5100/- స్వాధీనం**




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 15:**

మండలంలోని పోతవరం గ్రామ పొలాల్లో రహస్యంగా పేకాట (కోత ముక్క) ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్ ఆర్. శ్రీకాంత్ , వారి సిబ్బందితో కలిసి మెరుపు దాడి చేసి పట్టుకున్నారు.పోలీసులు వారి వద్ద నుండి పేకాటకు సంబంధించిన రూ. 5,100/- నగదుతో పాటు, వారు ఉపయోగించిన నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం దర్యాప్తు చేస్తున్నారు. పిఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ, అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, ఎక్కడైనా పేకాట లేదా ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి

**- నిందితుడు బిట్ల సూరిబాబు అరెస్ట్**



**వేటపాలెం, పెన్ పవర్, అక్టోబర్ 15**

వేటపాలెం మండలం అక్కాయపాలెం పంచాయతీ పరిధిలోని యానాది కాలనీలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ బిట్ల సూరిబాబు (45) అనే నిందితుడిని చీరాల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన కేసు నమోదు అనంతరం, చీరాల డీఎస్పీ మోయిన్ నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు నిర్వహించారు. గాలింపు చర్యల ఫలితంగా కటారిపాలెం జీడి తోటలో దాక్కున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మోయిన్ మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ, "పోక్సో కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. మీడియా సమావేశంలో చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం స్ఫూర్తితోనే యువత ముందుకు సాగాలి

**గౌరీ అమర్నాథ్ పూలమాల సమర్పణ - ఘన నివాళి**

**చీరాల, పెన్ పవర్, అక్టోబర్ 15**

భారతీయ శాస్త్రవేత్త, ఏరోస్పేస్ ఇంజనీర్, 11వ రాష్ట్రపతి కీ.శే. డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా చీరాల గర్ల్స్ హైస్కూల్‌లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ యువనేత మద్దులూరి గౌరీ అమర్నాథ్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌరీ అమర్నాథ్ మాట్లాడుతూ - "షార్ రాకెట్ కేంద్రం స్థాపనలో కలాం గారు ముఖ్యపాత్ర పోషించారు. ఆయన దేశానికి గౌరవం తెచ్చిన శాస్త్రవేత్త. ఆయన స్ఫూర్తితోనే ఈరోజు అనేక యువ శాస్త్రవేత్తలు ముందుకు వెళ్తున్నారు. ప్రతి విద్యార్థి ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి" అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, గోలి జగదీష్, పాలెపు సత్య శ్రీనివాస్, దోగుబర్తి సురేష్, గంజి పురుషోత్తం, విష్ణుమొలకల మధుబాబు, తేలప్రోలు నాగేశ్వరరావు, మామిడాల సుబ్బారావు, షేక్ లాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు మువ్వల వెంకటరమణ, అవ్వారు హనుప్రసాద్, తడవర్తి చంద్ర, నాశిన మనీ గౌడ్, జనసేన నాయకులు మామిడాల శ్రీనివాసరావు, గూడూరు శివరాం ప్రసాద్, కస్తూర్బా గాంధీ గర్ల్స్ హైస్కూల్ టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.




# ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 15:**

చిలకలూరిపేట : భారత మాజీ రాష్ట్రపతి, మిస్సయిల్ మాన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించడం జరిగింది.మాజీ మంత్రివర్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ, పట్టణ మైనార్టీ నాయకుల అధ్యక్షతన డాక్టర్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన వారికి స్వీట్లు పంచి పెట్టడం జరిగింది. అనంతరం రైతు బజారు ఎదుట ఉన్న కలాం విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అడ్డ రోడ్డు సెంటరు వద్ద ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ భారత దేశం గర్వించదగ్గ వ్యక్తులలో ఏపీజే అబ్దుల్ కలాం ది ప్రముఖ స్థానమని, అటువంటి వ్యక్తులు అరుదుగా జన్మిస్తారని, అంతటి మహోన్నత వ్యక్తిని రాష్ట్రపతిగా నాడు ఎంపిక చేసిన వ్యవహారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో క్రియాశీల పాత్ర పోషించారని నేతలు గుర్తు చేసుకున్నారు. పోఖరాన్ అణు పరీక్షలో వారు పోషించిన పాత్ర మరువలేనిదని, విద్య పట్ల, విద్యా విధానం పట్ల,




విద్యార్థుల పట్ల వారు ఎంతో ఆసక్తి చూపేవారని, చనిపోయే చివరి క్షణం వరకూ తనకు తెలిసిన విషయాలను భవిష్యత్ తరాలకు అందించాలని వారు ఎంతో శ్రమకోర్చి దేశం అంతటా పర్యటించేవారని, ఎక్కడో రామేశ్వరం లో చిన్న కుటుంబం లో జన్మించి యావత్ ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం అని, వారి ఆశయాలకు ప్రతి భారతీయుడు పునరంకితం కావాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్



చైర్మన్ షేక్ రఫాని, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్, నియోజకవర్గ అధికార ప్రతినిధి మురుకొండ మల్లిబాబు, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్ష,కార్యదర్శులు బ్యాంక్ బాజీ , షేక్ రియాజ్ , మాజీ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అల్లాబక్షు, షేక్ జానీ భాషా, రఫీ, ముస్తాఫా, ముల్లా కరీముల్లా, అజహరుద్దీన్, జరీనా సుల్తానా, కూనల ప్రమీల, ఫాతిమా, నసీమా బేగం మరియు మైనార్టీ ముఖ్య నాయకులు మరియు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సంస్కరణలు దేశప్రజలకు తెలిసేలా చేయడమే ప్రధాని పర్యటన లక్ష్యం

**మోదీ రాకతో రాయలసీమకు ప్రయోజనం : ప్రత్తిపాటి.**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక కార్యక్రమం..సీమ ప్రాంత పారిశ్రామిక ప్రగతికి దోహదం చేస్తుంది : ప్రత్తిపాటి.**



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 15**

జీఎస్టీ శ్లాబుల తగ్గింపు చరిత్రాత్మక నిర్ణయమని, ఇంత మంచి సంస్కరణ యొక్క ఫలితాలు ప్రజలు అందరూ పొందాలన్న సదాశయంతోనే ప్రధాని మోదీ పర్యటనను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రేపు కర్నూలులో జరిగే ప్రధాని నరేంద్రమోదీ పర్యటన ఏర్పాట్లలో భాగంగా ప్రత్తిపాటి బుధవారం స్థానికంగా ఏర్పాటుచేస్తున్న బహిరంగ సభను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. సభా నిర్వహణ.. భద్రతా ఏర్పాట్లు.. ప్రజలకు కల్పించాల్సిన వసతులు.. పార్కింగ్ నిర్వహణపై ప్రత్తిపాటి, నేతలు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

**ప్రధాని మోదీ సభ రాయలసీమ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు బీజం వేస్తుంది..**

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాహితం కోసం చేపట్టిందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా జీఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకే కూటమిప్రభుత్వం స్వయంగా ప్రధానమంత్రి పర్యటనను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలు ప్రభుత్వాలు అందిస్తున్న ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. దేశంలోని 141 కోట్ల మంది ప్రజలకు జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలు తెలిసేలా చేయడమే ప్రధాని మోదీ పర్యటన ప్రధాన లక్ష్యమని ప్రత్తిపాటి చెప్పారు. రాయలసీమలో జరిగే ప్రధాని సభ నూతన చరిత్రకు నాంది పలుకుతుందని, సీమ ప్రజలకు మేలుచేసేలా ఈ ప్రాంత పారిశ్రామిక ప్రగతికి దోహదపడుతుందన్నారు. మోదీ ప్రారంభించే వేలకోట్ల ప్రాజెక్టులు.. చేసే శంఖుస్థాపనలు రాష్ట్ర ప్రగతి అధ్యాయంలో కొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా నిలుస్తాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

# గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్ర పతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 15:**

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుదవారం జనవిజ్ఞాన వేదిక మరియు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్ర పతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం జరిగింది. చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్షులు తేళ్ళ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అబ్దుల్ కలాం చేసిన సేవలు వివరించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్సీ కే.యస్. లక్ష్మణ రావు రాసిన యన్ యం యం ఎస్ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జె వి వి అధ్యక్షులు ధూళిపాళ వెంకట్రావు, కార్యదర్శి బొంత అజయ్ బాబు, డా. పి వి సుబ్బారావు, లాలూ దాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షులు సిద్ధాంతి కరిముల్లా డా.దార్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు జనసేన పార్టీ ఆధ్వర్యంలో





**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 15**

నరసరావుపేటలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పల్నాడు రోడ్డులోని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అబ్దుల్ కలాం 1931లో తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించి, భారతదేశానికి అపార గౌరవాన్ని తెచ్చిన గొప్ప శాస్త్రవేత్తగా, దేశానికి పదకొండవ రాష్ట్రపతిగా సేవలందించారని తెలిపారు. క్షిపణి సాంకేతికతలో చేసిన విశిష్ట కృషి కారణంగా ప్రజల మన్ననలు పొందారని, ఆయనను దేశం మొత్తం క్షిపణి మనిషిగా గుర్తిస్తుందని పేర్కొన్నారు. దేశ భద్రత, విజ్ఞానం, యువతలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో కలాం చేసిన సేవలు అపూర్వమని, ఆయన చూపిన మార్గం ప్రతి యువకుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు అబ్దుల్ కలాం ఆశయాలను ఆచరిస్తూ సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనంద్ బాబు, మండల అధ్యక్షుడు కృష్ణం శెట్టి గోవిందరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి గుప్తా శ్రీకాంత్, బీమా సాంబ.

# ఆర్టీసీ బస్టాండ్ ఎదురు రోడ్డు ప్రమాదం

**ప్రమాదం లో పలువురికి గాయాలు**




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 15:**

చిలకలూరిపేట: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు మరియు బొలెరో వాహనం ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి.ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి వెళు తున్న సమయంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# కమీషనర్ పి. శ్రీహరి బాబు చే ఈస్ట్ క్రిస్టియన్ పేట ఎస్సీ హాస్టల్ తనిఖీ

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 15:**

చిలకలూరిపేట: పట్టణంలోని ఈస్ట్ క్రిస్టియన్ పేటలో గల ఎస్సీ హాస్టల్ (షెడ్యూల్డ్ కులాల వసతి గృహం) ను పురపాలక సంఘం కమీషనర్ పి. శ్రీహరి బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.హాస్టల్‌లో వసతి, పారిశుద్ధ్యం పరిశీలనఈ సందర్భంగా కమీషనర్ శ్రీహరి బాబు హాస్టల్ గదులను, వంటశాల , భోజనశాల , మరియు పారిశుద్ధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను కూడా పరిశీలించి, హాస్టల్ నిర్వహణ తీరుపై పలు సూచనలు చేశారు.

**విద్యార్థులతో ముచ్చట**

విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగారు. ఎటువంటి లోపాలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అధికారులు, సిబ్బంది విద్యార్థుల పట్ల మరింత బాధ్యతగా వ్యవహరించి, మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు.

**సిబ్బందికి దిశానిర్దేశం**

విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని, హాస్టల్‌ను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని కమీషనర్ ఆదేశించారు. ఎస్సీ హాస్టల్స్ పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, ఆ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో హాస్టల్ వార్డెన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ రహిత నరసరావుపేట కోసం అవగాహన కార్యక్రమం

**నరసరావుపేట శాసనసభ్యులు**

**డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ఆధ్వర్యంలో**

**నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి అక్టోబర్ 15**

నరసరావుపేట వినుకొండ రోడ్డులో గల ఆర్‌టీసీ బస్ స్టాండ్ పరిసర ప్రాంతంలో బుధవారం నాడు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం మరియు జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ చదరవాడ అరవింద్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో క్యాంటీన్‌లు, దుకాణాలు, ప్రయాణికులు, వ్యాపారస్తులను కలుసుకుని ప్లాస్టిక్ వాడకం పూర్తిగా మానుకోవాలని, నరసరావుపేట పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ చురుకుగా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారులకు కలిగే ప్రయోజనాలు, వినియోగదారులకు అందే సౌకర్యాల గురించి ఆయన వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, శుభ్రమైన పట్టణ నిర్మాణంలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50 వేల ఆర్థిక సహాయం

**వేటపాలెం, పెన్ పవర్, అక్టోబర్ 15**

సముద్ర స్నానానికి వెళ్లి అలల వృద్ధుతి మృతిచెందిన ఘటన వేటపాలెం మండలంలో విషాదాన్ని నింపింది. వేటపాలెం మండలం కొత్తపేట గ్రామం వడ్డిసంఘం ప్రాంతానికి చెందిన కోట గౌతమ్ ఆదివారం సముద్ర స్నానానికి వెళ్లగా అలల వృద్ధుతి కారణంగా నీట మునిగిపోయాడు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన గౌతమ్ తల్లి తీరని దుఃఖంలో మునిగిపోయారు.బాధిత కుటుంబాన్ని



పరామర్శించిన ఎమ్మెల్యే కొండయ్య సూచన మేరకు ఆయన తనయుడు మద్దులూరి గౌరీ అమర్నాథ్ రూ.50,000 ఆర్థిక సహాయం అందజేశారు. కూచన షారోన్ కుటుంబ సభ్యులతో కలిసి తల్లిని పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అమర్నాథ్ వెంట వెళ్లి బాధిత కుటుంబానికి సాంత్వన తెలిపారు.

## ఎమ్మెల్సీలు సేఫ్...

**విశాఖపట్టణం, అక్టోబరు 15 పెన్ పవర్:** వైసీపీ అధికారంలో ఉండగా ఎమ్మెల్సీగా ఎన్నికయిన వారు ఇద్దరు పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. అయితే వీరిద్దరూ ఏ పార్టీ వైపు ఉన్నారంటే వైసీపీకి మద్దతుదారులుగానే ఉన్నారు. పార్టీ నుంచి సస్పెండ్ అయినప్పటికీ వీరిపై అనర్హత వేటు పడలేదు. దీంతో వీరు సస్పెండ్ అయినా వైసీపీ నేతలుగానే శాసనమండలిలో కొనసాగుతుండటం చర్చనీయాంశమైంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దువ్వాడ శ్రీనివాస్, తూర్పు గోదావరి జిల్లా అనంతబాబులను గత వైసీపీ హయాంలో ఎమ్మెల్సీ పదవి వరించింది. వారు పార్టీ కోసం చేసిన పనితీరును గమనించి నాడు జగన్ వీరిద్దరికీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. దువ్వాడ శ్రీనివాస్ అయితే టెక్కలి సీటు కూడా కేటాయించారు.. రంపచోడవరంలో పట్టున్న నాయకుడిగా పేరున్న అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో నిందితుడిగా మారి కొన్నాళ్ల పాటు జైలులో ఉండి బెయిల్ పై బయటకు వచ్చారు. అయితే డ్రైవర్ ను హత్య చేసి ఇంటికి పార్సిల్ చేశారన్న ఆరోపణలను గతంలో టీడీపీ చేసిన విమర్శలు జనంలోకి వెళ్లాయి. ఈ ఘటన కూడా గత ఎన్నికల్లో వైసీపీ ఓటమికి కారణమయిందని చెప్పాలి. అందుకే వెంటనే వైసీపీ నష్టనివారణ చర్యల్లో భాగంగా అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అయితే సస్పెండ్ చేసి ఇన్నేళ్లవుతున్నా పదవి మాత్రం పదిలంగానే ఉంది. దీంతో ఆయన అనధికారికంగా వైసీపీ నేతగానే చలామణి అవుతున్నారు. . ఫ్యాన్ పార్టీని షేక్ చేస్తున్నాయా? టెక్కలి నుంచి పోటీ చేసి... ఇక మరొకనేత దువ్వాడ శ్రీనివాస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ నేత, ప్రస్తుత మంత్రి అచ్చెన్నాయుడు చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత దువ్వాడ శ్రీనివాస్ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. దువ్వాడ జీవితంలోకి దివ్వెల మాధురి ఎంట్రీతో ఆయన ఫ్యామిలీ ట్రబుల్స్ లో ఇరుక్కున్నారు. ఈ విషయం మీడియాలో హైలెట్ కావడంతో వెంటనే దువ్వాడ శ్రీనివాస్ ను కూడా వైసీపీ సస్పెండ్ చేసింది. అయితే ఆయన కొన్నాళ్ల నుంచి రాజకీయాలకు దూరంగానే ఉంటున్నారు. వ్యాపారాలకు పరిమితమయ్యారు. హైదరాబాద్ లోనే ఎక్కువ సమయం ఉంటున్నారు. ఎమ్మెల్సీ పదవికి మాత్రం రాజీనామా చేయలేదు. అయితే బహిరంగంగా ఇద్దరూ వైసీపీకి మద్దతు పలకపోతున్నప్పటికీ ఇద్దరు ఎమ్మెల్సీలు పరోక్షంగా వైసీపీకి అండగా నిలుస్తుండటం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఆల్ ఈజ్ వెల్ కాదే...

**విజయవాడ, అక్టోబరు 15, పెన్ పవర్:)**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే తాను 1995 ముఖ్యమంత్రిని అని ప్రకటించుకుంటున్నారు. అయితే టీడీపీ కార్యకర్తలు మాత్రం మళ్లీ తమ కథ మొదటికే వచ్చిందని సోషల్ మీడియాలో బాధను వెళ్లగక్కుతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ కార్యకర్తలకు మాత్రం న్యాయం జరగడం లేదని వారు బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. తమకు పదవుల విషయంలోనూ, ఇతర పనుల అంశంలోనూ అన్యాయం జరుగుతుందని తెలుగు తమ్ముళ్లు ఆక్రోశిస్తున్నారు. ఎమ్మెల్యేలు తమకు లాభం వచ్చిన వారికే అన్ని రకాలుగా ప్రయోజనాలు అందిస్తున్నారని, గత ఐదేళ్లు జెండా పట్టుకుని వైసీపీ ప్రభుత్వంలో తెగించి పోరాటం చేసినా అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టించుకోవడం లేదంటున్నారు. . అనేక మంది తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో ఇదే రకమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ లు జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు ఖచ్చితంగా అక్కడ నేతలు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. కానీ తమ అభిప్రాయాలను చెప్పుకునేందుకు అవసరమై సమయాన్ని ఇవ్వకపోవడంతో తాము నిజాలు వెల్లడించలేకపోతున్నామని కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలను ప్రాణంలా చూసుకుంటానని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పార్టీ నాయకత్వం మర్చిపోయిందని కొందరు తెలుగు తమ్ముళ్లు సూటిగా పార్టీ సోషల్ మీడియా వేదిక ద్వారానే ప్రశ్నిస్తున్నారు. . ఇటీవల కాలంలో ప్రభుత్వం అనేక అంశాల విషయంలో వివాదాలు ఎదుర్కొన్నప్పటికీ టీడీపీ సోషల్ మీడియా యాక్టివ్ గా లేకపోవడం అందుకు నిదర్శనమని చెబుతున్నారు. మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో చేసిన ప్రకటన విషయంలో గాని, ములకలచెరువు కల్తీ మద్యం కేసులో టీడీపీ కార్యకర్తల నుంచి పార్టీకి అండగా స్పందన లేకపోవడాన్ని గుర్తించాలంటున్నారు. ఇప్పటికీ చంద్రబాబు నాయుడు గతంలో మాదిరిగా అధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని ఆల్ ఈజ్ వెల్ అనుకుంటే వచ్చే ఎన్నికల్లో ఇబ్బందులు పడతామని, గ్రౌండ్ లెవెల్ రియాలిటీని తెలుసుకోవాలనుకుంటే కార్యకర్తల మనోభిప్రాయాన్ని తెలుసుకోవాలని వారు సూచిస్తున్నారు. మరి పార్టీ నాయకత్వం క్యాడర్ గోడు పట్టించుకుంటుందా? లేదా? అన్నది చూడాలి.

## కూటమి మధ్య ఫిలిం కార్పొరేషన్ రచ్చ

**అనంతపురం, అక్టోబరు 15, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణల మధ్య మరో వివాదం తలెత్తినట్లు కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి విషయంలో మళ్లీ మెలిక పడినట్లే కనిపిస్తుంది. టూరిజం, సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేన నేత కందుల దుర్గేష్ ఉన్నారు. అందులోనూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమా రంగానికి చెందిన వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేడు నెలలవుతున్నప్పటికీ ఇప్పటి వరకూ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా ఎవరినీ నియమించకపోవం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఇది ఇద్దరి మధ్య నెలకొన్న వివాదమే కారణమని తెలుస్తోంది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నామినేటెడ్ పదవిని హోల్డ్ లో పెట్టినట్లు పార్టీ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి. అనుకుంటున్నట్లు మరోసారి ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి విషయంలో పవన్ కల్యాణ్, నందమూరి బాలకృష్ణల మధ్య విభేదాలు తల్తెయని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి పవన్ కల్యాణ్ పేరును ఎప్పుడో ఖరారు చేశారు. బహిరంగంగా కూడా చెప్పారు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా అవుతారని ఆయన బహిరంగంగానే వెల్లడించారు. పవన్ కల్యాణ్ ప్రకటన తర్వాత అది కార్యరూపం దాల్చకపోవడానికి నందమూరి బాలకృష్ణ మెలిక పెట్టడమే కారణమన్న వార్తలు పార్టీ వర్గాల్లో హల్ చల్ చేస్తున్నాయి. దీంతో చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నియామకంలో ఆచితూచి వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బాలకృష్ణ వ్యతిరేకించడంతో... నిర్మాత ఎ.ఎం రత్నం పేరును నందమూరి బాలకృష్ణ వ్యతిరేకించినట్లు తెలిసింది. అదే సమయంలో తాను ఒక పేరును అధినాయకత్వం ముందుంచినట్లు సమాచారం. అయితే పవన్ కల్యాణ్ కు చెందిన జనసేన పార్టీ నేత సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నియామకం జరగకపోవడం ఈ ఊహాగానాలను బలపరుస్తున్నాయి. అదే సమయంలో నందమూరి బాలకృష్ణ కూడా ఇటీవల అసెంబ్లీలో ఫ్రస్టేషన్ కు లోనయింది అందుకేనంటున్నారు. అదే సమయంలో ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో లూలూ గ్రూపు విషయంలో తన అభ్యంతరాలను పవన్ కల్యాణ్ కుండ బద్దలు కొట్టినట్లు తెలిసింది. దీంతో ఇటు పవన్ కల్యాణ్, అటు నందమూరి బాలకృష్ణ ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నియామకం విషయంలో పట్టుబట్టడం వల్లనే నియామకం ఇప్పటి వరకూ జరగలేదంటున్నారు. విజయవాడ దుర్గ గుడి దేవస్థానం కమిటీ ఛైర్మన్ పదవిని తన మనిషికే ఇప్పించుకోవడంలో నందమూరి బాలకృష్ణ సక్సెస్ అయ్యార. మరి ఈ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.

# దిశా, దశ మార్చే నవంబర్ నెల

**విశాఖపట్టణం, అక్టోబరు 15, పెన్ పవర్:**
నవంబర్ నెల.. ఏపీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. ఆంధ్రప్రదేశ్ దశ, దిశ మార్చేలా నవంబర్ నెలలో అడుగులు పడనున్నాయి. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే అన్నింటికంటే ముందుగా టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు కోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖలో టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. నవంబర్ నెలలో విశాఖ వేదికగా టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అలాగే కాగ్నిజెంట్ కూడా క్యాంపస్ ఏర్పాటు చేస్తోంది.
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో నవంబర్ నెల కీలకంగా మారనుంది. నవ్యాంధ్రకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. దీంతో దిగ్గజ సంస్థల చూపు ఏపీ వైపు మళ్లుతోంది. ఈ క్రమంలోనే ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. అందులో కొన్ని ప్రాజెక్టులు వేగంగా అడుగులు పడుతున్నాయి కూడా. అయితే నవంబర్ నెల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దశ, దిశను మార్చేలా కనిపిస్తోంది. రెండు కీలక ప్రాజెక్టులకు నవంబర్ నెలలో శ్రీకారం చుట్టనున్నారు. విశాఖపట్నంలో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు అన్నింటికంటే మ్నుందుగా ఆసక్తి చూపించింది టీసీఎస్.. ఆ తర్వాతనే ఒక్కొక్క కంపెనీ ఏపీవైపు, అందులోనూ విశాఖవైపు దృష్టి సారిస్తూ వచ్చాయి. ఈ క్రమంలోనే నవంబర్ నెలలో టీసీఎస్ తన కార్యకలాపాలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. విశాఖపట్నంలో టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతో తొలుత ఒప్పందం చేసుకున్నది కూడా టీసీఎస్ కావటం విశేషం. ఇక టీసీఎస్ కోసం రుషికొండ సమీపంలోని ఐటీహిల్స్‌పై భవనాన్ని కూడా ఏపీ ప్రభుత్వం కేటాయించింది. హిల్-3లోని మిలీనియం టవర్స్ లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఈ భవనంలో ఉద్యోగులు పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ ఏర్పాట్లు కూడా తుది దశకు చేరుకున్నాయి. నవంబర్ నెలలో విశాఖ వేదికగా టీసీఎస్ కార్యకలాపాలు మొదలుపెట్టనుంది. ఈ విషయాన్ని ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా తెలిపారు. టీసీఎస్ క్యాంపస్‌లో తొలిదశలో 2 షిఫ్టులలో 2000 మంది ఉద్యోగులు పనిచేస్తారు. ఆ తర్వాత ఉద్యోగుల సంఖ్యను క్రమంగా ఆరు వేలకు పెంచాలనే ఆలోచనలో ఉన్నారు. అందుకు తగ్గట్లుగా మిలీనయం టవర్స్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఈ భవనం నుంచి తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తూనే.. టీసీఎస్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. రూ.1,370 కోట్లతో 12000 మందికి ఉపాధి కల్పించనుంది. టీసీఎస్ క్యాంపస్ కోసం ఏపీ ప్రభుత్వం ఐటీహిల్-3పై 22 ఎకరాలను కేటాయించింది. ఎకరా 99 పైసలకు చొప్పున కేటాయింపులు చేశారు. మరోవైపు టీసీఎస్ బాటలోనే మరో ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కూడా విశాఖలో పెట్టుబడులు పెట్టనుంది. రూ.1,582 కోట్లతో విశాఖలో కాగ్నిజెంట్ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతోంది. కాగ్నిజెంట్ క్యాంపస్ ద్వారా సుమారుగా 8000 మందికి ఉద్యోగాలు రానున్నాయి.. ఈ నేపథ్యంలో కాగ్నిజెంట్ సంస్థకు కూడా ఎకరా భూమి 99 పైసలకు కేటాయించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాపులుప్పాడ వద్ద 21.31 ఎకరాల భూమి కేటాయించింది. మరోవైపు కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ సీఈవో రవి కుమార్ వచ్చే నవంబర్‌లోనే విశాఖపట్నం పర్యటించనున్నారు. ఈ పర్యటనలోనే ఆయన విశాఖ కాగ్నిజెంట్ క్యాంపస్ ప్రారంభంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇవి కాకుండా గూగుల్ డేటా సెంటర్.. రూ.లక్ష కోట్లతో టీసీఎస్ డేటా సెంటర్ ఏర్పాటు కానున్నాయి.

# లిక్కర్ స్కామ్ వైసీపీ వైపు టర్న్ అవుతుందా?



**విజయవాడ, అక్టోబరు 15, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ లో కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. జోగి రమేష్ ఈ కేసులో ప్రధాన కారకుడుగా ఏ1 నిందితుడు జనార్థన్ రావు చేసిన ఆరోపణలు ఇప్పుడు ఫ్యాన్ పార్టీని షేక్ చేస్తున్నాయి. తాను వైసీపీ హయాంలోనే నకిలీ మద్యాన్ని తయారు చేశానని జనార్థన్ రావు ఎక్సైజ్ విచారణలో తెలిపారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తాను ఆ కార్యక్రమాన్ని మానేశానని చెప్పుకొచ్చారు. అయితే జోగి రమేష్ ఫోన్ చేసి టీడీపీ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఇరకాటంలో పెట్టేందుకు తిరిగి నకిలీ మద్యం తయారు చేయాలని చెప్పడంతోనే తాను తిరిగి ఈ పనికి పూనుకున్నానని నిందితుడు జనార్థన్ రావు చెప్పడం వైసీపీని ఇబ్బందుల్లోకి నెట్టేలా కనిపిస్తుంది. ములకలచెరువు మద్యం కల్తీ మద్యం కేసులో జనార్థన్ రావు సంచలన విషయాలు వెల్లడించారు. జనార్థన్ రావు వీడియో ఒకటి బయటకు రావడంతో సంచలనంగా మారింది. మాజీ మంత్రి జోగి రమేష్ ప్రోద్బలంతోనే తాను నకిలీ మద్యం తయారు చేశానని, టీడీపీ అధికారంలోకి రాగానే ఆపానని జనార్థన్ రావు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. తనకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జోగి రమేష్ ఫోన్ చేసి నకిలీ మద్యాన్ని తయారు చేయాలని కోరినట్లు జనార్థన్ ఎక్సైజ్ అధికారుల విచారణలో తెలిపినట్లు ఆ వీడియోలో జనార్థన్ రావు చెప్పడాన్ని బట్టి చూస్తే జోగి రమేష్ చుట్టూ కల్తీ మద్యం ఉచ్చు ఆయన చుట్టూ బిగుసుకుంటుందని చెప్పొచ్చు. మరొకవైపు జనార్థన్ రావు ఫోన్ పోయిందని చెప్పినా సిమ్ ను యాక్టివ్ చేసే పనిలో ఎక్సైజ్ అధికారులున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నకిలీ మద్యం కేసులో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మొన్ననే జోగి రమేష్ అన్నారు. కొందరిని ఇరికించే కుట్ర చేస్తున్నారని ఆయన అన్నారు. దానికి తగినట్లుగానే జనార్థన్ రావు కూడా జోగి రమేష్ పేరు చెప్పడంతో ఆయనను విచారించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. జోగి రమేష్ ను ఎప్పుడైనా అదుపులోకి తీసుకోవచ్చున్న ప్రచారం జరుగుతుంది. 2021లోనే విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారు చేశానని జనార్థన్ ఒప్పుకోవడం, జోగి రమేష్ ప్రమేయం ఉందని చెప్పడంతో నకిలీ మద్యం కేసు వైసీపీ వైపు టర్న్ అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తుంది. వైసీపీ నేతలు మాత్రం జనార్థన్ రావు వీడియో చూస్తుంటే కుర్చీలో కూర్చోబెట్టి కావాలని చెప్పించినట్లు కనపడుతుందని అంటున్నారు. తమపై బురదను కడుక్కోలేక వైసీపీపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

**చాట్ లీక్... కలకలం**

ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం కేసు మరో సంచలన ఘట్టానికి చేరుకుంది. ఈ కేసులో ఏ1 నిందితుడు జనార్దన్ రావు , మాజీ మంత్రి జోగి రమేష్ మధ్య జరిగిన వాట్సాప్ చాట్ లీక్ అవ్వడంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఈ చాట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, రాజకీయ వర్గాల్లో పెను కలకలం సృష్టిస్తోంది.

**చాట్‌లో వెల్లడైన సంచలన విషయాలు**

వాట్సాప్ చాట్ ప్రకారం.. వైసీపీ పాలనలో జోగి రమేష్ ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారీకి పాల్పడినట్లు నిందితుడు జనార్దన్ రావు అంగీకరించాడు. ఈ చాట్‌లో బయటపడిన కీలక అంశాలు ఇవీ.వ్యాపారం ఆపమని ఆదేశం: టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, జోగి రమేష్ ఆదేశాల మేరకే నకిలీ మద్యం వ్యాపారం ఆపేశామని జనార్దన్ రావు వెల్లడించారు. తిరిగి ప్రారంభించమని ఆదేశం: ఏప్రిల్ 2025లో జోగి రమేష్ ఫోన్ చేసి, "టిడిపి ప్రభుత్వంపై చెడ్డపేరు తెచ్చేలా మళ్లీ తయారీ మొదలు పెట్టు" అని చెప్పినట్లు చాట్‌లో స్పష్టంగా ఉంది. తంబళ్లపల్లి నియోజకవర్గంలో సూచన: అక్కడి నుంచి మొదలుపెడితే చంద్రబాబు ప్రభుత్వంపై బురద జల్లవచ్చు అని జోగి రమేష్ సూచించినట్టు వివరించారు. వేర్వేరు పేర్లతో గదులు అద్దెకు తీసుకుని, మద్యం తయారీకి యంత్రాలు ఏర్పాటు చేశారు. దీని తర్వాత సాక్షి మీడియా ముందు ఉంచి లీక్ ఇచ్చి రైడ్ చేయించడం, తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ప్లాన్‌ను ఈ చాట్‌లో స్పష్టంగా వెల్లడించారు. జనార్దన్ రావు ఫిర్యాదు ప్రకారం, జోగి రమేష్ చిన్నప్పటి పరిచయాన్ని అడ్డుపెట్టుకుని నమ్మించి మోసం చేశాడని పేర్కొన్నాడు. అలాగే, ఈ వ్యవహారంలో జై చంద్రారెడ్డికి అసలు సంబంధం లేదని స్పష్టం చేశాడు.

**జోగి రమేష్ స్పందన..**

ఈ వ్యవహారంపై జోగి రమేష్ మొదట స్పందిస్తూ, జనార్దన్ రావు ఎవరో తనకు తెలియదని, తనపై కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఆ తర్వాత, పరిచయం ఉన్నప్పటికీ స్నేహితుడేమీ కాదని, జనార్దన్ తన ఇంటికి రాలేదని, సంబంధం లేని విషయాలను వెల్లడించాడని తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఏలూరు రేంజ్ ఐజీ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయబడింది. సిట్ అధికారులు ఇప్పటికే సీసీ ఫుటేజీలను సేకరించినట్లు సమాచారం. జోగి రమేష్‌పై ఆరోపణలు, అసలు కుట్రదారులు ఎవరు అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

**రాజకీయ పరిణామాలు, ప్రభుత్వం స్పందన**

మాజీ మంత్రి జోగి రమేష్ పేరు తెరపైకి రావడం, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కుట్ర జరిగిందన్న ఆరోపణలు రాజకీయ వర్గాల్లో పెద్ద సంచలనం సృష్టించాయి. ప్రభుత్వం ఈ వ్యవహారంపై కఠినంగా ఉండాలని, ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉన్నా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. నకిలీ మద్యం కేసు రాజకీయంగా పెను దుమారం రేపనుంది. జనార్దన్ రావు%-%జోగి రమేష్ చాట్ లీక్, ఇతర సాక్ష్యాలు సిట్ దర్యాప్తుకు మార్గం చూపుతున్నాయి. ఈ కేసులో వచ్చే రోజుల్లో రాజకీయ పరిణామాలు, అధికారుల చర్యలు రాష్ట్రంలో ప్రధాన అంశాలుగా మారనున్నాయి.

# నాగబాబు మౌనం దేనికి సంకేతం



**విజయవాడ, అక్టోబరు 15, పెన్ పవర్:**జనసేన ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటారు. అయితే గత కొద్ది రోజుల నుంచి ఆయన మౌనంగా ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి పెద్దగా ప్రస్తావించడం లేదు. ఎక్స్ లోనూ పోస్టు కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం తన అన్న చిరంజీవిపై అసెంబ్లీలో నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలే కారణమని అంటున్నారు. సహజంగా నాగబాబు తన సోదరులు ఎవరిపైనా విమర్శలు వస్తే అసలు ఊరుకోరు. ఆయన వెంటనే కౌంటర్ ఇస్తారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఉండటంతో పాటు తాను పార్టీ ఎమ్మెల్సీగా ఉండటంతో నాగబాబు కొంత తనను తాను సంబాళించుకుని సంయమనంతో వ్యవహరిస్తున్నారని అంటున్నారు. నిజానికి చిరంజీవి ఫ్యాన్స్ హైదరాబాద్ లో మీటింగ్ పెట్టినప్పుడు కూడా నాగబాబుకు తెలిసే జరిగిందంటారు. ఆయనను సంప్రదించిన తర్వాతనే చిరంజీవి బ్లడ్ బ్యాంకులో మీటింగ్ వారు పెట్టుకున్నారని, అయితే తాను మాత్రం పెదవి విప్పకుండా కొంత సంయమనం పాటించారని చెబుతున్నారు. అసెంబ్లీలో నందమూరి బాలకృష్ణ మాట్లాడిన దానికి మెగాస్టార్ చిరంజీవి ఒక ప్రకటన చేసి ఊరుకున్నారు. అయితే మెగా ఫ్యాన్స్ మాత్రం ఇప్పటికీ సోషల్ మీడియాలో నందమూరి బాల కృష్ణకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతూనే ఉన్నారు. దీనిని కూడా నాగబాబు కానీ, పవన్ కల్యాణ్ కానీ ఎవరూ ఖండించలేదు. అసలు ఆ విషయాన్ని ఇద్దరూ ఇంతవరకూ ప్రస్తావించలేదు. గతంలో బాలకృష్ణ పై నాగబాబు చేసిన విమర్శలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పవన్ కల్యాణ్ అంటే ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి మౌనంగా ఉన్నారని భావించినా నాగబాబు సైలెంట్ గా ఉండటానికి మాత్రం కారణం రాజకీయ కారణమేనని అంటున్నారు. అయితే మౌనంగా ఉన్నప్పటికీ తన కోపాన్ని సన్నిహితుల వద్ద నాగబాబు ప్రస్తావిస్తున్నట్లు సమాచారం. నాగబాబు విదేశాల నుంచి వచ్చిన చిరంజీవితో భేటీ అయిన సందర్భంలోనూ ఈ ప్రస్తావన రావడంతో చిరంజీవి కూడా ఆ విషయాన్ని వదిలేయాలని సూచించడంతో నాగబాబు మౌనంగా ఉన్నారని అంటున్నారు. అయితే తన అన్న చిరంజీవిపై చేసిన వ్యాఖ్యల నుంచి ఇంకా తేరుకోలేని నాగబాబు మాత్రం ప్రస్తుతం ఏపీ రాజకీయాల విషయంలో మాత్రం పెద్దగా స్పందించడం లేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

# కుల్దీప్ ఏడు స్థానాలు ముందుకు.. అగ్ర స్థానంలోనే బుమ్రా.. టాప్-5లోకి జైశ్వాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ బుధవారం (అక్టోబర్ 15) ప్రకటించిన లేటెస్ట్ టెస్ట్ ర్యాంకింగ్స్ లో టీమిండియా ప్లేయర్స్ మెరుగైన స్థానాల్లో నిలిచారు. ఇటీవలే వెస్టిండీస్ తో జరిగిన రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో అదరగొట్టిన టీమిండియా ప్లేయర్స్ ర్యాంకింగ్స్ లో మంచి ఫలితాలను రాబట్టారు. విండీస్ తో సిరీస్ కు ముందు ఏడో స్థానంలో ఉన్న జైశ్వాల్.. ఐదో ర్యాంక్ కు చేరుకున్నాడు. విండీస్ తో జరిగిన రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో 219 పరుగులు చేసి ఈ సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఢిల్లీ వేదికగా అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన రెండో టెస్టులో జైశ్వాల్ 175 పరుగులతో చెలరేగాడు.

ఇంగ్లాండ్ స్టార్ ఆటగాడు జో రూట్ అగ్ర స్థానంలోనే కొనసాగుతున్నాడు. బ్రూక్, విలియంసన్, స్మిత్ వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. వెస్టిండీస్ సిరీస్ ఆడకపోయినా పంత్ 8 వ ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. గిల్ 13 వ స్థానంలో ఉండగా.. రాహుల్ రెండు ర్యాంక్ లు మెరుగుపర్చుకొని 33 వ స్థానానికి చేరుకున్నాడు. బౌలింగ్ లో బుమ్రా టాప్ ర్యాంకు నిలబెట్టుకున్నాడు. బుమ్రా మినహాయిస్తే టీమిండియా బౌలర్లు ఎవరూ టాప్-10 లో స్థానం దక్కించుకోలేకపోయారు. విండీస్ తో జరిగిన సిరీస్ లో తన స్పిన్ మ్యాజిక్ తో రాణించిన కుల్దీప్ యాదవ్ ఏడు ర్యాంక్ లు ఎగబాకి 14 వ స్థానానికి చేరుకున్నాడు.

ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ 12 ర్యాంక్ లో ఉన్నాడు. రబడా, హెన్రీ, కమ్మిన్స్, హేజాల్ వుడ్ వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. జడేజా ఒక స్థానం దిగజారి 18 ర్యాంక్ తో సరిపెట్టుకున్నాడు. ఆల్ రౌండర్ విభాగానికి వస్తే జడేజా ఎవరికి అందనంత దూరంలో అగ్ర స్థానంలో ఉన్నాడు. మెహదీ హసన్ మిరాజ్, స్టోక్స్, ముల్డర్, కమ్మిన్స్ వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. టెస్ట్ టీం ర్యాంకింగ్స్ లో ఆస్ట్రేలియా టాప్ లో ఉంది. సౌతాఫ్రికా, ఇంగ్లాండ్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉంటే.. ఇండియా నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

# కమర్షియల్ కాంట్రాక్ట్ రిజెక్ట్ చేసిన కోహ్లీ.. RCB ని వీడుతున్నాడా.. లేక IPL కు గుడ్ బై చెబుతాడా..?




**హైదరాబాద్ పెన్ పవర్:** కింగ్ కోహ్లీ ఆర్సీబీ కమర్షియల్ కాంట్రాక్ట్ రిజెక్ట్ చేయడం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. ఇప్పటికే టెస్టులు, టీ20 లకు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ.. అటు వన్డే కెరీర్ అగమ్యగోచరంగా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. వచ్చే వరల్డ్ కప్ ఆడతాడా లేదా బీసీసీఐ పక్కన పెడుతుందా అనే చర్చలు నడుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కోహ్లీ తన కాంట్రాక్ట్ రిజెక్ట్ చేయడం టాక్ ఆఫ్ ద క్రికెట్ వరల్డ్ గా మారింది.

ఐపీఎల్ హిస్టరీలో ఒకే ఫ్రాంచైజీకి ఆడుతున్న కొద్ది మంది ప్లేయర్లలో కోహ్లీ ఒకరు. మొదటి నుంచీ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (%=జదీ%) కి ఆడుతున్నాడు. నెక్స్ట్ ఐపీఎల్ కోసం ఆక్షన్ దగ్గరపడుతున్న టైమ్ లో కోహ్లీ నిర్ణయంపై ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఆర్సీబీని వీడుతున్నాడా.. అనే డౌట్స్ ఇప్పుడు సోషల్ మీడియలో చక్కర్లు కొడుతున్నాయి.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ టాపిక్ పై మహమ్మద్ కైఫ్ క్లారిటీ ఇచ్చాడు. బెంగళూరు ఫ్రాంచైజీ కి ఆడటానికి కోహ్లీ కట్టుబడి ఉన్నాడని కైఫ్ తెలిపాడు. అదే విధంగా కొత్త కాంట్రాక్ట్ పై సంతకం చేయలేదని కూడా చెప్పాడు. కోహ్లీ ఫస్ట్ అండ్ లాస్ట్ మ్యాచ్ బెంగళూరుకే ఆడతానని ప్రామిస్ చేశాడు. అదే మాట మీద ఉంటాడు.. అని ఇన్ స్టాలో వీడియో పోస్ట్ చేశాడు కైఫ్. ఆర్సీబీ కాంట్రాక్ట్ కు సైన్ చేయకపోవడానికి కారణం చెప్పాడు కైఫ్. త్వరలో ఆర్సీబీ ఫ్రాంచైజ్ మారుతోందని.. కొత్త ఫ్రాంచైజ్ వచ్చిన తర్వాత .. అన్ని చర్చల తర్వాత కొత్త కాంట్రాక్ట్ ఉంటుందని తెలిపాడు. అందుకోసమే కోహ్లీ వెయిట్ చేస్తున్నట్లు కైఫ్ వివరణ ఇచ్చాడు.

# ఇది కదా రోకో బాండ్ అంటే: కోహ్లీని చూడగానే రోహిత్ ఎమోషనల్.. స్పెషల్ విష్ అదిరిపోయిందిగా!



**హైదరాబాద్ పెన్ పవర్:** అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో జరగబోయే వైట్ బాల్ సిరీస్ సవాలుకు టీమిండియా సిద్ధమవుతోంది. మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న ఈ మెగా సిరీస్ కు భారత జట్టు బుధవారం (అక్టోబర్ 15) ఆస్ట్రేలియాకు బయలుదేరింది. బుధవారం (అక్టోబర్ 19) ఉదయం ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి టీమిండియా మొదటి బ్యాచ్ చేరుకుంది. భారత ఆటగాళ్లను చూసేందుకు ఫ్యాన్స్ ఎయిర్ పోర్ట్ దగ్గర గుంపులుగా వచ్చారు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తో పాటు ఇతర కోచింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రం బయలుదేరనున్నారు. విమాశ్రమానికి చేరుకోవడానికి ముందు భారత ఆటగాళ్లు బస్సు ఎక్కుతున్న జట్టు వీడియోను బీసీసీఐ షేర్ చేసింది. ఈ వీడియోలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఎమోషనల్ అయినట్టు కనిపిస్తోంది. రోహిత్ కంటే ముందే కోహ్లీ బస్ లో కూర్చుకున్నాడు. బస్ ఎక్కే ముందు కోహ్లీని చూస్తూ రోహిత్ తన స్పెషల్ గా నమస్కారం చేశాడు. బస్ లోపలి వెళ్లిన తర్వాత హగ్ ఇచ్చాడు. అంతకముందు టీమిండియా నయా కెప్టెన్ శుభమాన్ గిల్ ను రోహిత్ హగ్ చేసుకున్నాడు. ఈ వీడియోలో రోహిత్ సహచర ప్లేయర్లతో కలిసిపోయిన విధానం ముచ్చటగొలిపే విధంగా అనిపిస్తుంది. సోషల్ మీడియాలో బీసీసీఐ షేర్ చేసిన ఈ వీడియో వైరల్ అవుతోంది. రెండు బ్యాచ్ లుగా టీమిండియా ఆసీస్ లో అడుగుపెట్టనుంది. ఇందులో భాగంగా మొదటి బ్యాచ్ ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంది.

టీమిండియా వెళ్లబోయే తొలి బ్యాచ్ లో విరాట్ కోహ్లీ ముందు వరుసలో కనిపించాడు. ఆ తర్వాత రోహిత్ శర్మ, నయా కెప్టెన్ శుభ్మాన్ గిల్, హర్షిత్ రాణా, శ్రేయాస్ అయ్యర్, అర్షదీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ ఉన్నారు. రెండు బ్యాచ్‌లలో ఆటగాళ్లను పంపాలని బీసీసీఐ నిర్ణయించింది. రెండో బ్యాచ్ ఈ రోజు సాయంత్రం లేదా రేపు ఉదయం బయలుదేరే అవకాశం ఉంది. కోహ్లీ, రోహిత్ శర్మ ఏడు నెలల తర్వాత గ్రౌండ్ లో కనిపించనుండడంతో ఈ సిరీస్ కు వీరిద్దరూ ప్రధాన ఆకర్షణగా మారనున్నారు.

**అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో సిరీస్:**

2020 తర్వాత ఇండియా తొలిసారి వైట్ బాల్ ఫార్మాట్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. అక్టోబర్ 19 నుంచి 25 వరకు వన్డే సిరీస్.. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకు టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 19న పెర్త్ లో తొలి వన్డేతో టూర్ మొదలవుతుంది. అక్టోబర్ 23 న అడిలైడ్ లో రెండో వన్డే.. అక్టోబర్ 25 న సిడ్నీలో మూడో వన్డే జరుగుతుంది. ఆ తర్వాత టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 29 న మనుకా ఓవల్ లో తొలి టీ20 ప్రారంభమవుతుంది. ఆ తర్వాత మెల్‌బోర్న్, హొబర్ట్, గోల్డ్ కోస్ట్, బ్రిస్బేన్ లలో వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు టీ20 మ్యాచ్ లు ఆడాల్సి ఉంది.

**ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కు భారత వన్డే జట్టు :**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్),
నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ , హర్షిత్ రాణా, మహమ్మద్ సిరాజ్, అర్షదీప్ సింగ్, ప్రసిద్ కృష్ణ, ధృవ్ జురెల్, యశస్వి జైశ్వాల్



# అదిరిపోయే రేంజ్ లో రాజు గారి కంబ్యాక్



దిల్ రాజు. తెలుగు రాష్ట్రాల్లో ఈయన తెలియని వారు లేరు. డిస్ట్రిబ్యూటర్ గా కెరీర్ ను మొదలుపెట్టిన ఆయన తర్వాత నిర్మాతగా మారి, గత కొంతకాలంగా టాలీవుడ్ లోని అగ్ర నిర్మాతల్లో ఒకరిగా రాణిస్తున్నారు. దిల్ రాజు నుంచి సినిమా వస్తుందంటే ఆ సినిమా మ్యాగ్జిమమ్ హిట్ అనే పేరును సంపాదించుకున్నారు. ఆయన జడ్జిమెంట్‌కు అంత వాల్యూ ఉండేది.

**గత కొన్నాళ్లుగా పెద్దగా లక్ లేదు**

కానీ కొన్నాళ్లుగా దిల్ రాజు బ్యానర్ నుంచి వచ్చిన సినిమాలు అనుకున్న స్థాయి సక్సెస్ అందుకోవడం లేదు. రీసెంట్ టైమ్స్ లో సంక్రాంతికి వస్తున్నాం తప్పించి ఆయనకు, ఆయన బ్యానర్ కు సాలిడ్ హిట్ అనేది లేదు. ఆయనేం చేసినా పెద్దగా కలిసి రావడం లేదు. ఈ విషయాన్ని స్వయంగా దిల్ రాజు కూడా సభా ముఖంగా ఒప్పుకుంటున్నారు.

**ఓజి కొత్త ఎనర్జీని ఇచ్చింది**

అయితే రీసెంట్ గా పవన్ కళ్యాణ్ ఓజి సినిమాను డిస్ట్రిబ్యూట్ చేసి మళ్లీ మంచి సక్సెస్ ను అందుకున్న దిల్ రాజు, ఆ సినిమా తనకు కొత్త ఎనర్జీని ఇచ్చిందని కూడా స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఆ ఎనర్జీతోనే దిల్ రాజు ఇప్పుడు వరుస సినిమాలను లైన్ లో పెడుతున్నట్టు తెలుస్తోంది. అయితే ఈసారి దిల్ రాజు లైన్ లో పెడుతుంది కేవలం తెలుగు ప్రాజెక్టులు మాత్రమే కాదు, వివిధ ఇండస్ట్రీల నుంచి స్టార్ హీరోలతో రాజు గారు సినిమాలు చేయబోతున్నారని తెలుస్తోంది.

**మరోసారి రిస్క్ చేస్తున్న దిల్ రాజు**

తెలుగులో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో సినిమాలను తీయాలని ప్రయత్నిస్తున్న దిల్ రాజు, కోలీవుడ్ లో అజిత్ తో సినిమా తీయాలని చూస్తున్నారట. అవి మాత్రమే కాకుండా బాలీవుడ్ లో అక్షయ్ కుమార్ తో సంక్రాంతికి వస్తున్నాంను రీమేక్ చేయడంతో పాటూ, సల్మాన్ ఖాన్ తో ఓ సినిమాను ప్లాన్ చేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో జెర్సీ, హిట్ ది ఫస్ట్ కేస్ సినిమాలతో నిర్మాతగా బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి ఆ సినిమాలతో డిజప్పాయింట్ అయిన దిల్ రాజు, ఇప్పుడు మరోసారి బాలీవుడ్ వైపు కన్నేశారని, ఈసారి ఎలాగైనా అక్కడ సక్సెస్ అందుకోవాలని దిల్ రాజు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఈసారైనా రాజు గారి రిస్క్ కు తగ్గ ఫలితం వస్తుందేమో చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com